# రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి, విజయాలను అందించే దైవంగా, వినాయకుణ్ణి హిందూ సమాజం కొలుచుకుంటుందని అన్నారు.దైవ పూజలను, ధార్మిక క్రతువులు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాయకునికి తొలి ప్రాధాన్యతనిస్తామని కేసీఆర్ తెలిపారు. వాడ వాడలా మండపాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు గణేశ్ నవరాత్రులు జరుపుకుంటూ, పిల్లలు పెద్దలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం తిరిగి గాడినపడి, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ, ఏకదంతున్ని కేసీఆర్ ప్రార్థించారు.









# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# అదిగదిగో ఖైరతాబాద్ మహా గణపయ్య

## ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ.. నేడు తొలి పూజ

- ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 69 అడుగుల మహాగణపతి
- పంచముఖ సంకటహర రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడు
- మట్టితో పర్యావరణ హితంగా విగ్రహం నిర్మాణం
- సోమవారం గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ
- ఆదివారం నుంచే దర్శనానికి పోటెత్తిన భక్తజనం

**హైదరాబాద్ పెన్ పవర్:** భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువుదీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు.ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు.ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి.వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని మరో ప్రసిద్ధ గణపతి మండపమైన బాలాపూర్‌లో ఈ ఏడాది పూరీ జగన్నాథ్ ఆలయ థీమ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

# ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు

- మహబూబాబాద్‌లో 19.1 సెం.మీ. వర్షం
- నెల్లికుదురు శివారు మర్రికుంటవాగు కల్వర్టు వద్ద తెగిన రహదారి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 9 జిల్లాల్లో జోరు వానలు పడ్డాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో 19.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలోని నెల్లికుదురు, నర్సింహులపేట, మహబూబాబాద్, పెద్దవంగర, దంతాలపల్లితోపాటు పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. వరంగల్ జిల్లాలోని రాయపర్తి, వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్, చిట్యాల, వెలిగొండ, అడ్డగూడూరు, సూర్యాపేట జిల్లాలోని జాజిరెడ్డిగూడెం, నాగారం, మద్దిరాల, తిరుమలగిరి మండలాల్లో భారీగా కురిశాయి. వాగులు, వంకలు పొంగి పొర్లి.. చెరువులు నిండుకుండలా మారాయి. పలు మండలాల్లో పంటలు నీట మునిగాయి. రోడ్లు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

### నేడు, రేపు వర్ష సూచన

సోమ, మంగళవారాల్లోనూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది.

# కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు: కొండా మురళి



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని కొండా మురళి అన్నారు. కొండా సురేఖ ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత తొలిసారిగా వరంగల్ లో పార్టీ కార్యకర్తలతో కొండా దంపతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ... కొండా సురేఖను గెలిపించడంలో రాహుల్‌గాంధీ పాత్ర ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు. "పదవులు ఇవాళ వస్తాయి.. రేపు పోతాయి. కానీ, మాట కోసం నిలబడతాం. కృతజ్ఞత అనేది మా రక్తం, మా కుటుంబంలో ఉంది. కొండా సురేఖను సారీ అని ఒక్క మాట చెప్పమన్నారు. పదవి ఉంటే ఉండనీ .. పోతే పోనీ అని నా భార్య సారీ చెప్పలేదు. ఎన్ని రోజులు బతికామన్నది కాదు.. ఎలా బతికామన్నది ముఖ్యం" అని కొండా మురళి అన్నారు.

# కాంగ్రెస్-బీఆర్ఎస్ నాటకంలా అసెంబ్లీ సమావేశాలు

## ప్రభుత్వ తీరుపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా, కాంగ్రెస్--బీఆర్ఎస్ పార్టీల నాటకంలా సాగాయని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం బీజేపీ స్టేట్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్‌లో 23 లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు తేలినా, ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని నిలదీశారు. కుత్బుల్లాపూర్‌లోని రూ. 33 వేల కోట్ల విలువైన ఐడీపీఎల్ భూములను ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా ఎందుకు కాపాడటం లేదని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ పేరిట పేద అసైన్డ్ భూములను కారుచౌకగా కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్న ప్రభుత్వం, మూసీ నదిలో పెద్దల ఆక్రమణల జోలికి ఎందుకు వెళ్లడం లేదన్నారు. ప్రభుత్వంలోని మంత్రుల వ్యాపార ప్రయోజనాలు, క్విడ్-ప్రో-కో వ్యవహారాలపై తమ వద్ద 200లకు పైగా పక్కా ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేకపోతే గవర్నర్‌ను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆశ్రయించడంతో పాటు ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసం ముందే ధర్నా చేపడతామని స్పష్టం చేశారు.

# సుఖసంతోషాలు నింపాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నా



**హైదరాబాద్ పెన్ పవర్:** నాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకగా నిలుస్తుందని, గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు.సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని, వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు. పండుగను కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం ద్వారా సోదరభావం, సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని టీపీసీసీ చీఫ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.





# కొరివి బస్తీలో నూతన మంచినీటి బోరు ప్రారంభం..

## సమస్యలు తెలుసుకుని అధికారులకు తక్షణ పరిష్కారానికి సూచనలు..!



**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 13:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డివిజన్ కొరివి బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును దుండిగల్ మున్సిపల్ తొలి చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు, బస్తీ సభ్యులతో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా బస్తీలో పర్యటించిన వారు స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముదిరాజ్ భవన్‌లో బస్తీ సభ్యులతో సమావేశమై రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు తదితర మౌలిక వసతుల సమస్యలపై చర్చించారు.. స్థానికులు వివరించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఫోన్‌లో అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేష్, తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, జక్కుల శ్రీనివాస్ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, ఆనంద్ కుమార్, శంకర్ నాయక్, కుంటి నాగరాజు, సుధాకర్ రెడ్డి, భరత్ కుమార్, ప్యాక్ వైస్ చైర్మన్ నల్తూరి క్రిష్ణ, వార్డు ప్రెసిడెంట్ నర్సింగ్ గౌడ్ తదితర నాయకులు, బస్తీ సభ్యులు, మహిళలు, యువ నాయకులు పాల్గొన్నారు







# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలి..!

- శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యం లో ఉచిత మట్టి గణపతుల పంపిణీ..
- ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాలు పంపిణీ చేసిన సూరారం సీఐ బాలరాజు..
- భక్తులకు విగ్రహాలు అందజేత.. పీఓపీ విగ్రహాలతో జల కాలుష్యం..
- మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు.
- ప్రజల్లో అవగాహనకు సంఘం కృషి..
- సేవా కార్యక్రమాన్ని అభినందించిన సీఐ బాలరాజు..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 13:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూరారం సీఐ బాలరాజు, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ పిలుపునిచ్చారు.. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ శాఖ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్--కొంపల్లి వారి సౌజన్యంతో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సూరారం కాలనీలో భక్తులకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూరారం సీఐ బాలరాజు భక్తులకు స్వయంగా మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, శాంతి సామరస్యాలతో నిర్వహించుకోవాలని కోరారు.. సమాజ హితం కోసం శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను సీఐ అభినందించారు.సంఘ అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇప్పటికే చెరువులు, కుంటలు వివిధ రకాల కాలుష్యంతో కలుషితం అవుతున్నాయని అన్నారు. దీనికి తోడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాలు మరింత కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గత కొన్నేళ్లుగా తమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.. గణేష్ నవరాత్రులను కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా భక్తి ప్రవృత్తులతో నిర్వహించాలని సూచించారు.. ఇందులో భాగంగా సూరారం కాలనీలోని వాసుదేవ ఆశ్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం మహిళా సభ్యులు గీతాశ్రీధరాచార్యులు, రాచపూడి శ్రావణి చేతుల మీదుగా భగవద్గీత అభ్యాసకులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్ కుమార్, సభ్యులు గడ్డం రాంబాబు, హరి రాఘవేంద్ర, కనపర్తి సాయిరామ్, గడ్డం గోవర్ధన్ రావు, రామకృష్ణ శర్మ, రాచపూడి ప్రభాకర్, కోడూరి జగదీష్, సుబ్బలక్ష్మి సంజీవరావు, దివాకర్, చందు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది రాకేష్, జేఎస్ఆర్ అసోసియేషన్ గ్రూప్ సభ్యులు కిరణ్ సాయి, విశాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కంబాలపల్లి గ్రామపంచాయతీకి వైకుంఠ రథం అందజేత..

## దివంగత హెడ్మాస్టర్ శ్రీరామ్ వెంకన్న-సరోజినీ దంపతుల జ్ఞాపకార్థం..



**మహబూబాబాద్, పెన్ పవర్, సెప్టెంబర్ 13:** గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు వారి పార్థివదేహాన్ని గౌరవప్రదంగా స్మశానవాటికకు తరలించేందుకు కంబాలపల్లి గ్రామపంచాయతీకి వైకుంఠ రథాన్ని దాతలు అందజేశారు. దివంగత పూర్వపు హెడ్మాస్టర్ శ్రీరామ్ వెంకన్న--సరోజినీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీరామ్ చంద్రశేఖర్, కమలాకర్, విజయకుమార్‌తో పాటు గ్రామ ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో సుమారు రూ.1.50 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని తయారు చేయించారు.. ప్రజలకు ఉపయోగపడే విధంగా రూపొందించిన ఈ వైకుంఠ రథాన్ని ఆదివారం గ్రామపంచాయతీకి ప్రజాప్రతినిధుల సమక్షంలో దాతలు అప్పగించారు.. ప్రతి మనిషి చివరి ప్రయాణం కూడా గౌరవప్రదంగా, ఊరేగింపుగా సాగాలనే చక్కటి ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు దాతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీరిక వసంత ఉపేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కమటం యాకన్న, దాతలు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, కొలిశెట్టి సత్యనారాయణ, శ్రీరామ్ విజయకుమార్, గ్రామ పెద్దలు బెల్లంకొండ శ్రీనివాస్, వార్డు సభ్యులు చీరిక వేణురెడ్డి, కోమరెల్లి పుల్యాల జైపాల్‌రెడ్డి, శిరంశెట్టి వేణు, కారింగుల రాజశేఖర్, ఇందుర్తి రవీందర్‌రెడ్డి, బొబ్బ వీరన్న, కొలిశెట్టి పురుషోత్తం, రామ్మూర్తి, కల్ల వెంకట్‌రెడ్డి, మాదారపు ఎల్లయ్య, రాయిశెట్టి సత్యం, గ్రామపంచాయతీ సిబ్బంది బోట్ల వీరన్న, సైదులుతో పాటు పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు

# హోటల్‌లో పోలీసుల రైడ్ : ముగ్గురు విటుల అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓ హోటల్‌లో రైడ్ చేసిన పోలీసులు ఓ విదేశీ మహిళను రక్షించి, ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్‌పహాడ్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సంజీవులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యభిచారం జరుగుతుందనే విశ్వసనీయ సమాచారంతో గగన్‌పహాడ్‌లోని ఓ హోటల్‌పై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విదేశీ మహిళను రక్షించారు. అదేవిధంగా వ్యభిచారానికి పాల్పడుతున్న ముగ్గురు విటులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం వెల్లడించారు.

# పొన్నం సత్తయ్య చాలా పాపులర్ : మంత్రి వివేక్





**హైదరాబాద్ పెన్ పవర్:** పొన్నం సత్తయ్య చాలా ప్రజాదరణ కలిగిన వ్యక్తి అని మంత్రి వివేక్ అన్నారు. పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలకు కోదండరెడ్డికి, కళారంగంలో సేవలకు గొట్టే కనకవ్వకు, సాహిత్య రంగంలో విశిష్ట సేవలకు వెలిచాల కొండలరావుకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. 2009లో తాను ఎంపీగా గెలిచిన సమయంలో పొన్నం ప్రభాకర్ కూడా ఎంపీగా గెలిచారని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్‌లో పొన్నం ప్రభాకర్ కీలకంగా పనిచేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా తెలంగాణ సాధన కోసం అందరం కలిసి కట్టుగా పనిచేశామని తెలిపారు. తెలంగాణను ఎలా సాధించుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండేదని అన్నారు. పొన్నం ప్రభాకర్ నుంచి చాలా విషయాలు నేర్చుకోవాల్సి ఉందని మంత్రి వివేక్ అన్నారు. ఉమ్మడి కుటుంబంలో ఉండే అనుబంధాలు, లాభాలు మరెక్కడా ఉండవన్నారు. ఉమ్మడి కుటుంబంలో కలిసి ఉండాలంటే ఓపిక, పరస్పర అవగాహన, అడ్జస్ట్‌మెంట్ అవసరమని చెప్పారు.

# దళితులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఇందిరా పార్క్ దగ్గర దళిత ఆత్మగౌరవ మహాధర్నాలో వక్తలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎర్రవల్లి ఘటనను నిరసిస్తూ మాల--మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ దగ్గర దళిత ఆత్మగౌరవ మహాధర్నా నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 13న దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు పలువురు రాజకీయ, మేధోప్రముఖులు హాజరయ్యారు. దళితులు వెళ్లిన మార్గంపై పసుపు నీళ్లు చల్లి శుద్ధీకరణ చేశారన్న ఆరోపణలపై ఆందోళన చేపట్టారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యాఖ్యలు, ఎర్రవల్లి శుద్ధీకరణ ఘటనల విషయంలో దళితులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి పూర్తి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బూతులు తిట్టడం పై మాల-మాదిగ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డి.. స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణపై మహాధర్నాలో చర్చ జరిగింది. సంక్షేమ పథకాల అమలు, దళితుల సమస్యలపై చర్చించారు. మాల ఉద్యమ నేత జి. చెన్నయ్య మాల, మాదిగ ఉద్యమ నేత మేడి పాపయ్య ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.

**అసెంబ్లీ ముందు జరిగిన ఘటన రాజ్యాంగ వ్యతిరేకం: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం**

అసెంబ్లీ ముందు జరిగిన సంఘటన కేవలం ఒక కులానికి సంబంధించింది కాదన్నారు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగిన సంఘటన అని అన్నారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 15 కి ఇది వ్యతిరేకమని అన్నారు. అస్పృశ్యతని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అంటరానితనం అంటే కేవలం మనుషులని భౌతికంగా కించపరచడమే మాత్రమే కాదన్నారు. మాటలపరంగా కించపరిచిన అది చాలా అన్యాయం చేసినట్టేనని అన్నారు. స్పీకర్ స్థాయిలో ఉన్న మనిషిని అలాంటి మాటలు అంటే కిందిస్థాయి మనుషులను పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నిరసన తెలపడానికి కేసీఆర్ ఫామ్ హౌస్ దగ్గరికి వెళితే... అక్కడ జరిగిన ఘటన శోచనీయమన్నారు. స్పీకర్ పై చేసిన వ్యాకలు ఎవరు ఉపేక్షించేవి కాదన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నేతలు మేలుకోవాలని సూచించారు.

**పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని కెసిఆర్ సమర్థిస్తున్నారా? ఎమ్మెల్యే సామేలు**

దళితులు అడుగుపెట్టిన భూమిని పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని కెసిఆర్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు. కేసీఆర్ మౌనం స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యల్ని సమర్థించడమైనా? అని ప్రశ్నించారు. దళితుల కోసం ఏ పని చేసినా బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అందుకే మాదిగ-మాల ఉపకలాల ఐక్యత వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దళిత నేతలపై జరిగిన అన్యాయాన్ని బి.జె.పి. నేతలు ఎందుకు ప్రశ్నించట్లేదని అన్నారు.

దళితులను చిన్నచూపు చూసే వారికి కఠిన శిక్ష పడాలని అన్నారు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి. స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు ఎవరు సహించేది కాదన్నారు. దీ=ూ పార్టీ కూడా ఆ వ్యాఖ్యలను సహించకూడదన్నారు. దళితులు అడుగుపెట్టిన భూమిని పసుపు నీళ్లతో శు ద్ధి చేయడం అంటే... మనం నిజంగా ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాల్సింది పోయి... దళితులు వెళ్లిన భూమిని పసుపు నీళ్లతో కడిగారని.. ఇంతకన్నా క్రూరమైన చర్య ప్రజాస్వామ్యంలో ఉండదన్నారు.

దళితులను చిన్నచూపు చూసే వారికి కఠిన శిక్ష పడాలని.. దళితుల ఐక్యత ఉంటే అందరి పని పట్టొచ్చునని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మీ బలమేంటో చూపించవచ్చని సూచించారు.

# హమ్మయ్య చల్లబడింది... అల్పపీడనం పుణ్యమా అని ఉక్కపోత నుంచి రిలీఫ్




**హైదరాబాద్ పెన్ పవర్:** . దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్ర తీరంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రాంతం రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బలపడే అవకాశం ఉంది. ఉత్తర ఆంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర ఆంధ్ర తీరం వెంబడి గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో, దక్షిణ కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని చెప్పింది.

**ఏపీలో భారీ వర్షాలు...**

ఆంధ్రప్రదేశ్ లో కూడా భారీ వర్షాలు పడే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. విపత్తు నిర్వహణ శాఖ ఈ అంచనాలను జారీ చేసింది. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లవద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం పశ్చిమ - వాయువ్య దిశగా దక్షిణ ఛత్తీస్‌గఢ్,విదర్భ మీదుగా కదిలే అవకాశం ఉందని అంచనా వేస్తుంది. ఈ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో నేడు, రేపు రాష్ట్రంలో వానలు పడతాయని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించిది. ఉత్తరాంధ్ర తీరంలో గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి 40నుంచి 50 కిలో మీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది. అనకాపల్లి,కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**తెలంగాణలో ప్రభావం...**

తెలంగాణపై బలహీన అల్పపీడన ప్రభావం ఉండనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సెప్టెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకూ భారీ వర్షాలు పడతాయని హెచ్చరికలు జారీ చేశాయి. గతంలో సెప్టెంబర్ 13 నుంచి 16 తేదీల మధ్య కురుస్తాయని అంచనా వేసిన వర్షాలు ఇప్పుడు ముందుగానే రానున్నాయి.వీటి ప్రభావం సెప్టెంబర్ 11 నుంచి 14 తేదీల మధ్య ఉండనుంది, ముఖ్యంగా సెప్టెంబర్ 12-13 తేదీలలో ప్రభావం అత్యధికంగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. సెప్టెంబర్ 15వ తేదీ నుంచి 17 మధ్య వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని చెప్పింది. దక్షిణ ఒడిశా తీరం వెంబడి అల్పపీడనం ఏర్పడింది. ఇది గతంలో అంచనా వేసిన మార్గం కంటే ఇప్పుడు ఉత్తర దిశగా కదులుతోంది. ఇది బలహీనపడి విదర్భ ప్రాంతంలో బలహీన అల్పపీడనంగా కేంద్రీకృతం అయ్యే అవకాశం ఉంది. దీని కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదు. తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో 50 నుంచి 70 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. హైదరాబాద్ మరియు దక్షిణ తెలంగాణతో సహాఇతర జిల్లాల్లో సెప్టెంబర్ 12 నుంచి 13 తేదీలలో మోస్తరు ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. , గద్వాల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలు ఈ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండకపోవచ్చు.

# స్పీకర్ నటనతో అసెంబ్లీలో ఏడ్చాడు : మాజీ ఎమ్మెల్యే ఆనంద్



**హైదరాబాద్ పెన్ పవర్:** కాడ్లాపూర్ రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వారి గ్రామానికి ఇండ్లకు తరలించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో పరిగి మండలం కాడ్లాపూర్ రైతులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యేలను టిఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ పరిగి మండలం కాడ్లాపూర్ రైతులు పరిశ్రమల స్థాపనకు భూములు ఇవ్వమని ధర్నా చేస్తుంటే అమానుషంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషనులకు తరలిస్తూ వారికి మంచినీళు ్ల ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మంచి నటకిరీటి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క స్పీకర్ ప్రసాద్ కుమార్ డ్రామా ఆటకెక్కిందన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ బిసి ఓసి సోదరులపై అనేక కేసులు పెట్టి జైలకు పంపించారని ఇక్కడ ఇగ పని అయిపోయిందని ఇక రాష్ట్రంలో ఎస్సీ కేసులు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు.స్పీకర్ ప్రసాద్ కుమార్ కేవలం ముఖ్యమంత్రి ముఖ్య మంత్రి కుటుంబీకులకు కమిషన్లు వస్తున్నాయని ఆ కమిషన్లు తనక్కూడా రావడం లేదని అసెంబ్లీలో బాధతో ఏడ్చారని విమర్శించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ కమిషన్ల కక్కుతితో వికారాబాద్లో అభివృద్ధి ఆగిపోతుందని గతంలో 100 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఆ కాంట్రాక్టర్ను కమిషన్లు అడిగారని కాంట్రాక్టర్ పారిపోయారని అన్నారు. అదేవిధంగా వికారాబాద్ నుండి పరిగి వెళ్లే రోడ్డుకు కూడా కమిషన్లు అడగడంతో సదరు కాంట్రాక్టర్ పారిపోయారని అదేవిధంగా మోమిన్పేట్ మండలం ఎంకతల గ్రామ సమీపంలో పరిశ్రమ వాడ ఏర్పాట్లు భూములను గత ప్రభుత్వం సేకరణ చేసి ఇచ్చిన సదరు కాంట్రాక్టర్ అభివృద్ధి చేసేందుకు రాగా అక్కడ కూడా కమిషన్లు అడగడంతో కాంట్రాక్టర్ పారిపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని విమర్శించారు. నేను ఎస్సీల గురించి మాట్లాడుతాను ఎస్సీల గురించి ఉన్నానని ఎస్సీ కార్డుతో ఎస్సీ ప్రజలను స్పీకర్ ప్రసాద్ కుమార్ మోసం చేస్తున్నారని అన్నారు.ఇలాంటి మోసాలు ఇక ఎన్నో రోజులు సాగవు అని ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షలు ఇస్తే ఎస్సీలకు ఆరు లక్షలు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇక్కడ హామీ ఇచ్చి అసెంబ్లీలో ఏ ఒక్కరోజు కూడా ఎస్సీల గురించి ప్రస్తావించిన పాపాన పోలేదని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కలిసి ఎందుకు వస్తే మధ్యాహ్నం 12 తర్వాత కూడా కలవని పరిస్థితి ఉందని నీవు ఎస్సివి ఎక్కడ అని నీవు పెద్ద దొరవాని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ విమర్శించారు. సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం కాదు రైతులను పేదలను ఆదుకునేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరిపల్లి గోపాల్ ముదిరాజ్ వేణుగోపాల్ రెడ్డి వికారాబాద్ పట్టణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంది : మాజీ ఎమ్మెల్యే



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కట్టుబడి ఉందని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన రాష్ట్రంలోని ఎస్టీ నియోజకవర్గాల ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులతో విస్తృత స్థాయి సమన్వయ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశం అనంతరం ఆయన 'దిశ' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. సమావేశంలో చర్చించిన అంశాలు, పార్టీ బలోపేతానికి అధిష్ఠానం ఇచ్చిన మార్గదర్శకాల వివరాలను ఆయన వెల్లడించారు.

**ప్రజల్లో ఉంటూ సేవలందించేవారికే ప్రాధాన్యం..**

పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో నిత్యం అందుబాటులో ఉండే నాయకులకే రాబోయే రోజుల్లో సముచిత గుర్తింపు, ప్రాధాన్యం లభిస్తాయని కేటీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. నియోజకవర్గాల్లో ప్రజల అభిప్రాయం, పార్టీ శ్రేణుల మనోభావాలు, క్షేత్రస్థాయిలో లభించే ఆదరణే భవిష్యత్ నిర్ణయాలకు కొలమానంగా ఉంటాయని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయం వరకు వేచి చూడకుండా, ఇప్పటి నుంచే నాయకులంతా తమ తమ నియోజకవర్గంలోని గిరిజన పల్లెల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అధిష్ఠానం పిలుపునిచ్చిందని వివరించారు.

**కేసీఆర్ హయాంలోనే గిరిజనులకు స్వర్ణయుగం..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు విశేష ప్రగతి సాధించాయని వెంకటేశ్వర్లు కొనియాడారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా మహిళా డిగ్రీ కళాశాల, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో ఏకలవ్య ఆదర్శ పాఠశాలలతో పాటు పలు గురుకుల పాఠశాలలను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసి విద్యా విప్లవానికి నాంది పలికిందని గుర్తుచేశారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని పోడు భూముల సమస్యను పరిష్కరించి, అత్యధిక సంఖ్యలో అర్హులైన పేద గిరిజనులకు పట్టాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

**త్వరలో గిరిజన ప్రాంతాల ప్రత్యేక అజెండా..**

ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను, ముఖ్యంగా పోడు పట్టాల పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో గిరిజన నేతలందరూ అందించిన విలువైన సూచనలను కేటీఆర్ స్వయంగా నమోదు చేసుకున్నారని, ప్రాంతాలవారీగా ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను గుర్తించి త్వరలోనే ఒక స్పష్టమైన ప్రజా అజెండాను రూపొందించనున్నట్లు చెప్పారు. ఆ కార్యాచరణతో త్వరలోనే గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తాటి వెంకటేశ్వర్లు 'దిశ'కు వివరించారు.

# టీఆర్ఎస్‌లోకి నాగోబా ఆలయ ప్రధాన పూజారి

**పలువురు సర్పంచులు, ముఖ్య నాయకులతో కలిసి చేరిక**

**అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ**



**హైదరాబాద్ పెన్ పవర్:** కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయ ప్రధాన పూజారి మేస్రం ఆనందరావు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురు సర్పంచులు, ముఖ్య నాయకులతో కలిసి పార్టీలో చేరారు. వారికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేస్రం ఆనందరావుతో పాటు గిన్నెర గ్రామ సర్పంచ్ మేస్రం భీమ్ రావు, ముత్తనూరు సర్పంచ్ రిట్టె విఠల్, ఆసోద గ్రామ సర్పంచ్ నగేశ్, మన్నూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాట్లె మనోహర్, సీనియర్ నాయకులు మేస్రం దయాకర్, తొడసం సాగర్, మేస్రం జంగురావు, కోట్నాక్ లక్ష్మణ్, సాయిగౌడ్, కోట్నాక్ కృష్ణా తదితరులు టీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పార్టీ సీనియర్ నాయకులు లోకిని రాజు తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ నెలలో ఇంద్రవెల్లి కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేలా కవిత ప్లాన్ చేస్తున్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ సక్సెస్‌తో జోష్ మీద ఉన్న పార్టీ క్యాడర్ లో మరింత ఉత్సాహం నింపేందుకు ఈనెల 20న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల పరిధిలోని పార్టీ కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నాల్లో కవిత ఉన్నారు. కొడంగల్ బహిరంగ సభ అనంతరం ఇంద్రవెల్లి సభ నిర్వహించే తేదీని ప్రకటించనున్నారు.

## కాంగ్రెస్‌లోనే ఉంటాం.. కానీ వార్ మాత్రం కంటిన్యూ!

# కొండా దంపతుల నెక్స్ట్ టార్గెట్ ఎవరు?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన 13 రోజుల తర్వాత సైలెంట్ మోడ్ వీడిన మాజీ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యారు. ఆదివారం వరంగల్‌లో తమ అభిమానులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం వేదికగా సొంత పార్టీలోని ప్రత్యర్థులపై కొండా దంపతులు పేల్చిన పొలిటికల్ బాంబులు ఇప్పుడు గాంధీ భవన్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. మంత్రి పదవి పోవడంతో కొండా దంపతులు కాంగ్రెస్ వీడి వేరే దారి చూసుకుంటారంటూ గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు చెక్ పెడుతూ.. కాంగ్రెస్‌ను వీడటం లేదు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో మళ్లీ వరంగల్ ఈస్ట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తీరుతానని, మళ్లీ మంత్రిని కూడా అవుతానని సురేఖ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి.

**కొండా ఫైర్ వెనుక ఎవరు?:**

సమావేశంలో మాట్లాడిన కొండా సురేఖ సొంత పార్టీలోని తన ప్రత్యర్థులపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీలో కొన్ని గుంటనక్కలు ఉన్నాయని, కానీ నిన్న మొన్న వచ్చిన వారు సైతం మాపై మాట్లాడుతున్నారు అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్ సీనియర్ నేతలైన కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య, నాయిని రాజేందర్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ తమ అనుచరులకే కాంగ్రెస్ టికెట్లు ఇచ్చేది మేమేనని, మా వారే గెలుస్తారంటూ కొండా దంపతులు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత సంచలనం రేపుతున్నాయి. అయితే నిన్నా మొన్నటి వరకు సైలెంట్‌గా ఉన్న కొండా దంపతులు ఆల్ ఆఫ్ సడెన్ గా ఇలా విరుచుకుపడటం వెనుక ఏం జరుగుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**మీనాక్షి ఫోన్ తర్వాత స్పీడ్:**

తాజా పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ కొండా సురేఖకు ఫోన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ఫోన్ కాల్ తర్వాతే కొండా దంపతులు తమ అనుచరులతో సమావేశమైన కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని చెప్పడంతో పాటు పార్టీలో ఉన్న తమ వ్యతిరేక వర్గంపై ఘాటు విమర్శలు చేయడం చర్చనీయాశం అవుతోంది. అధిష్టానం భరోసాతోనే కొండా దంపతులు ఈ రకంగా మాట్లాడారా లేక ఏది జరగాల్సి ఉంటే అది జరుగుతుందని ఈ విధంగా మాట్లాడారా అనేది సస్పెన్స్ గా మారింది.

**జిల్లా నాయకులా? స్టేట్ లీడర్లా?:**

కొండా దంపతులు చేసిన తాజా వ్యాఖ్యలను బట్టి కాంగ్రెస్ లోనే ఉంటూ రాజకీయం చేయబోతున్నట్లు స్పష్టం అవుతోంది. అయితే పార్టీలో కొనసాగుతూనే పార్టీకి చెందిన తమ వ్యతిరేక వర్గంపై చాలెంజ్ లు విసరడం అధికార పార్టీకి కొత్త తలనొప్పులు తేక మానదు. ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శల దాడి ఎదురవుతున్న తరుణంలో కొండా దంపతులు టార్గెట్ పాలిటిక్స్ కు తెరలేపితే అది అంతిమంగా ఎవరికి డ్యామేజ్ చేయనుంది అనేది సస్పెన్సే. మొత్తంగా ఇవాళ కొండా దంపతుల వ్యాఖ్యల వెనుక వారి టార్గెట్ ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ లోని తమ వ్యతిరేక నాయకులా లేక రాష్ట్ర స్థాయిలో మరెవరిపైనైనా గురి పెట్టారా? అన్నదే ఇప్పుడు హస్తం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఎస్పీ జానకి షర్మిలపై ఆరోపణలు..

# పోలీస్ సంక్షేమ సంఘం మద్దతు

**హైదరాబాద్ పెన్ పవర్:** నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలపై వస్తున్న ఆరోపణలను నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ఖండించింది. కొంతమంది తమ వ్యక్తిగత అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ఎస్పీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని నిర్మల్ పోలీసులు ముసుగులో స్వార్థపూరిత శక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలను తప్పుబట్టింది. ఈ మేరకు ఎస్పీ జానకి షర్మిలకు పూర్తి మద్దతు తెలుపుతూ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ఓ ప్రకటన విడుదల చేసింది. పోలీసు సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను నేరుగా కలిసి చెప్పుకునే అవకాశం ఎస్పీ జానకి కల్పించారని జిల్లాలో మొట్టమొదటి సారి హోంగార్డులు సైతం నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలను తెలిపే పరిస్థితి జానికీ వచ్చిన తర్వాతే ఏర్పడిందని పేర్కొన్నారు. శాఖపరమైన బదిలీలు, అటాచ్ మెంట్లు, ఇతర పరిపాలన చర్యలను కూడా వ్యక్తిగత నిర్ణయాలుగా చూయిస్తూ ఎస్పీపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు.

**మతం రంగు పులిమారు:**

కొద్ది మంది వ్యక్తిగత అభిప్రాయాలను, అసంతృప్తులను మొత్తం పోలీస్ శాఖకు వ్యతిరేకంగా చిత్రీకరించడాన్ని నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. సిబ్బంది ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కో ఆపరేటివ్ రుణాలకు చర్యలు తీసుకుందన్నారు. ప్రజలు, సిబ్బంది సమస్యలను నేరుగా ఎస్పీకి చెప్పుకునేలా అవకాశం కల్పిస్తూ ప్రతి రోజు నిర్మల్ లో గ్రీవెన్స్ డే






తీసుకువచ్చారని,ఐఐఐటీ బాసర విద్యార్థుల భద్రత, వారి సమస్యల విషయంలో ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోయినా సివిల్, ఏఆర్ సిబ్బందితోనే ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల విధులు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ఎన్నికలను ప్రత్యేకంగా రహస్య బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించారని ఇంత పారదర్శకంగా నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను సైతం కుల,
మతపరమైన రంగును పులిమి ఎస్పీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వదంతులను వ్యాప్తి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పోలీసు అధికారుల ముసుగులో బయటి వ్యక్తులు అనామక లేఖలు సృష్టించి సోషల్ మీడియాలో ఎస్పీ జానకిపై విషప్రచారం చేస్తున్నారని ఇలాంటి వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆస్తుల కంటే కుటుంబ విలువలే గొప్ప వారసత్వం : మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు పెద్దపీట వేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రవీంద్రభారతిలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మన సంస్కృతికి ప్రతీక అని, నేటి తరానికి కుటుంబ విలువలను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన పొన్నం సత్తయ్య ఆశయాలు స్ఫూర్తిదాయకమని ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు కొనియాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. వ్యవసాయ రంగంలో ఎం.కోదండరెడ్డి (వ్యవసాయ కమిషన్ చైర్మన్), సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, జానపద కళారంగంలో గొట్టె కనకవ్వకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఈ ముగ్గురికి జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకివ్వండి : మెట్టు సాయికుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీపై తెలంగాణ మత్స్య అభివృద్ధి సహకార సంస్థ, చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు మాక్ అసెంబ్లీ పేరుతో కపట నాటకాలు, డ్రామాలు ప్రదర్శించారని, ఆ కార్యక్రమాన్ని చూస్తే జబర్దస్త్ కామెడీ షో కూడా దిగదుడుపేనని, ఇకపై తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకివ్వడం మంచిదని ఆయన చురకలు అంటించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ప్రదర్శించిన నటన నాటకరంగ సంస్థలను మించిపోయిందని, కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని తదితరులకు నవరస సార్వభౌమ, కళా ప్రపూర్ణ, కళా తపస్వి వంటి బిరుదులు సరిపోతాయని మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. వచ్చే ఏడాది వారందరికీ గద్దర్ అవార్డులు ఇవ్వాల్సిందేనని, పేజీల కొద్దీ డైలాగులు చెబుతూ, కపట ఏడుపులతో కార్యక్రమాన్ని రక్తికట్టించారని ఆయన విమర్శించారు. వినాయక చవితి, దసరా నవరాత్రుల్లో వీధి నాటకాలు వేసుకోవడానికి తెలంగాణ భవన్‌ను అద్దెకిస్తే సరిపోతుందని సాయికుమార్ సూచించారు. ఇచ్చట నాటకాలు వేయబడును.. కపట నాటక సూత్రాలు నేర్పబడును.. నాటకాలకు భవనం అద్దెకు ఇవ్వబడును అంటూ బోర్డు పెట్టుకోవాలని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు ఉన్న 35 మంది ఎమ్మెల్యేల్లో కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని కేవలం ఐదుగురు మాత్రమే కోరుకుంటున్నారని, మిగిలిన 30 మంది రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనను సమర్థిస్తున్నారని సాయికుమార్ పేర్కొన్నారు. నిన్నటి మాక్ అసెంబ్లీలో కేవలం పది మంది ఎమ్మెల్యేలే ఎందుకు పాల్గొన్నారు?, వారిలోనూ సగం మంది బలవంతంగా వచ్చినట్లుగా కనిపించిందన్నారు. ఇంకా పదేళ్లపాటు ఆ మాక్ అసెంబ్లీ సెట్‌ను అక్కడే ఉంచుకోవాలని, ప్రజలు వారికి నిజమైన అసెంబ్లీ గేట్లు తెరిచే ప్రసక్తే లేదని మెట్టు సాయికుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి : మధుసూదనాచారి డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్‌రెడ్డి మండలిలో జరిగిన తీరుకు క్షమాపణ చెప్పాలని.. సభ హుందాతనాన్ని వమ్ము చేశారని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ బయట తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం



కుట్ర అని.. తాను పింక్ టీ షర్ట్ వేసుకున్నా సభలోనికి వెళ్లనివ్వలేదని అన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే మొదటి రోజు సభలోకి రానివ్వలేదని.. ఎలాంటి చర్చ లేకుండానే తమ సభ్యులను సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఓటింగ్ జరిగితే పార్టీ మారిన ఎమ్మెల్సీలపై వేటు పడుతుందని మూజువాణి ఓటుతో సస్పెండ్ చేశారని.. మూడు నిమిషాల్లో ప్రక్రియ ముగించారని తెలిపారు. ఎన్ని రోజులైనా సభ జరుపుతామని, ఏ సమస్యనైనా చర్చిస్తామని చెప్పిన పాలకపక్షం పారిపోయింది ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, డొల్లతనం మండలి సమావేశాల్లో బయటపడిందన్నారు. సభను నడపాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. హామీల అమలుపై చిత్తశుద్ధి కనిపించలేదని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంతటి పోలీసు బలగాల మోహరింపు లేదని.. లోపల మార్షల్స్ మోహరించారని.. చైర్మన్ తమ వైపు చూడనేలేదని అన్నారు. లైవ్ ప్రసారాల్లోనూ తమపై వివక్ష కొనసాగిందని ఆరోపించారు. తమ ప్రశ్నలకు మంత్రుల సమాధానాలు సరిగా లేవని చెప్పారు. ఆరు రోజుల్లో ఏ ఒక్క షార్ట్ డిస్కషన్ సరిగా జరగలేదని తెలిపారు. 20 అంశాలు తాము చర్చకు ప్రతిపాదించినా ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. వెయ్యి రోజుల పాలనలో ఏమీ చేయలేదని చర్చకు భయపడిందన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణి దేవీ మాట్లాడుతూ.. మహిళా ఎమ్మెల్యేలకు ఘోరమైన అవమానం జరిగిందని.. అది తెలంగాణకు జరిగిన అవమానం కాదా అని ప్రశ్నించారు. 40 మంది ప్రజాప్రతినిధుల చుట్టూ 500 మంది పోలీసులను మోహరిస్తారా అని నిలదీశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ పాల్గొన్నారు.

# కరాటేలో బంగారు పతకాలు సాధించిన చలకుర్తి చిన్నారులు




**హైదరాబాద్, పెన్ పవర్ సెప్టెంబర్ 13:** ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 పోటీల్లో నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్, సైకో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో బీఎస్ఆర్ కరాటే అకాడమీ నిర్వహించిన ఈ పోటీల్లో పాతనబోయిన విహాస్ కటాస్, కుమితే విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. అదేవిధంగా పాతనబోయిన సుదీక్ష కుమితే విభాగంలో బంగారు పతకం, కటాస్ విభాగంలో వెండి పతకం సాధించింది. నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన ఈ చిన్నారులు హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో పతకాలు సాధించడం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు మాట్లాడుతూ తమ విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. తమను నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, శిక్షణలో అత్యుత్తమ మెళకువలు నేర్పిస్తూ విజయాల బాటలో నడిపిస్తున్న కోచ్ మహేష్ నాయక్కు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన చిలుక మధుసూదన్ రెడ్డి



**ఎల్బీనగర్, పెన్ పవర్ సెప్టెంబర్ 13:** ఉప్పల్ బగాయత్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం భూమిపూజ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో 1.33 మట్టి విగ్రహాల పంపిణీ




**హైదరాబాద్ పెన్ పవర్:** గణేష్ ఉత్సవాల సందర్భంగా పర్యావరణహిత విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఉద్దేశంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎవీణూ) 1,33,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. సెప్టెంబర్ 13, 2026 నాటికి హెచ్‌ఎండీఏ మొత్తం 1,33,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. ఇందులో 8 అంగుళాల పరిమాణం గల 80,000 విగ్రహాలు,1 అడుగు పరిమాణం గల 53,000 విగ్రహాలు ఉన్నాయి. భక్తులు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గణేష్ ఉత్సవాలను బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించేందుకు ప్రోత్సహించడమే మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ప్రధాన ఉద్దేశం. ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పర్యావరణహిత విధానాలను పాటించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు హెచ్‌ఎండీఏ పలు కార్యక్రమాలను చేపడుతోంది. ప్రజలు, భక్తులు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని హెచ్‌ఎండీఏ విజ్ఞప్తి చేసింది. తద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించడంతో పాటు హైదరాబాద్ నగరాన్ని మరింత హరిత, పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరింది.

# అసెంబ్లీని వదిలేసి.. తెలంగాణ భవన్ లో ఈ ఆటేంది కేటీఆర్?




**హైదరాబాద్ పెన్ పవర్:** రోజులు మారుతున్నాయి. గతంలో అసెంబ్లీ సమావేశాలంటే ప్రభుత్వాన్ని నిలదీస్తూ.. వ్యూహాత్మకంగా ఇరుకున పెడుతూ.. అవకాశం చిక్కిన ప్రతిసారి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అయ్యేలా చేయటం ఉండేది. అధికారపక్షం ప్రదర్శించే అధిపత్య ధోరణికి ఇబ్బంది పడుతూనే.. అసెంబ్లీ వేదికగా ప్రధాన ప్రతిపక్షం పోరాటాలు చేసేవి. అయితే.. గడిచిన పుష్కర కాలంలో ఆ తీరు మారిపోయింది. అధికారంలో ఎవరున్నా.. ప్రతిపక్షం సభలో ఉండని పరిస్థితి. తెలంగాణలో చూస్తే.. మొదటి దఫాతో పోలిస్తే.. కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరింతగా మారింది. ప్రధాన ప్రతిపక్షం ఉనికి ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి. ఉన్న గుప్పెడు మంది మాట్లాడేందుకు చేసే ప్రయత్నాల్ని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిలువరించేది. అనూహ్య రీతిలో బలపడిన బీజేపీ నేతల్ని సైతం మాట్లాడనిచ్చేది కాదు.అంతదాకా ఎందుకు తనపై పడిన నిందకు ప్రతిగా రాజీనామా చేసిన ఈటల రాజేందర్.. ఉప ఎన్నికలో సంచలన విజయాన్ని సొంతం చేసుకొని అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు ఆయన నానా ఆగచాట్లు పడాల్సి పరిస్థితి. ఆయన్ను అసెంబ్లీలోకి అడుగు పెట్టనీయకుండా పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగిన వైనాన్ని మర్చిపోలేం. ఈటలను అసెంబ్లీలో ఎదుర్కొనేందుకు గులాబీ బాస్ ఒక పట్టాన ఇష్టపడే వారు కాదన్న మాట అప్పట్లో బలంగా వినిపించేది. బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ నిర్వాహణ.. ప్రధాన ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం లేకుండా చేయటంలో సక్సెస్ అయ్యిందన్న విమర్శ ఉంది. కట్ చేస్తే.. రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. ఆయన పాలనలోని తప్పుల్ని చీల్చి చెండాడేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉంటారని.. ఆయన్ను తట్టుకోవటం రేవంత్ కు కష్టంగా మారుతుందన్న మాట వినిపించింది. ఈ వాదనకు భిన్నంగా కేసీఆర్ తీరు ఉండటం తెలిసిందే. అసలు ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని పరిస్థితి. ఆయన్ను అసెంబ్లీకి రప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఏదో ఒకప్రయత్నం చేస్తూ ఉండటం కనిపిస్తుంది. ఆయన సభకు రావాలని.. పలు అంశాల మీద చర్చ చేయాలని.. తాము సమాధానం ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నట్లు చెప్పటం కనిపిస్తుంది. ఆ మాటకు వస్తే.. ప్రధాన ప్రతిపక్ష నేతను అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని ఇంతలా కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే అవుతారు. అయితే.. రేవంత్ ను ముఖ్యమంత్రిగా అంగీకరించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఇష్టం లేదు. ఇది కూడా కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకపోవటానికి ఉన్న కారణాల్లో ఒకటిగా చెబుతారు. కేసీఆర్ సంగతి పక్కన పెడితే.. కేటీఆర్, హరీశ్ రావు లాంటి వారు సభకు హాజరై రేవంత్ సర్కారు చేసే తప్పుల్ని చీల్చి చెండాల్సిన అవసరం ఉంది. అయితే.. అందుకు భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలపటం తప్పేం కాదు. కానీ.. తాము పదేళ్ల ప్రభుత్వంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన నిబంధనలు.. తాము అనుసరించిన రూల్స్ ను తామే బ్రేక్ చేసేలా వ్యవహరించటం సరైన వ్యూహం కాదన్న విషయాన్ని కేటీఆర్.. హరీశ్ లు మర్చిపోయినట్లుగా కనిపిస్తోంది.ఏ రాష్ట్ర అసెంబ్లీలో అయినా అధికారపక్షానికి అడ్వాంటేజ్ ఉంటుంది. ప్రధాన ప్రతిపక్షానికి పరిమితులు ఉంటాయి. వాటిని ఎదుర్కొంటూ.. ప్రభుత్వాన్ని ఇరుకున పడేలా వ్యవహరించటం అంత తేలికైన పని కాదు. ఈ క్లిష్టమైన ఆట ఆడే కన్నా.. ప్రభుత్వం తీరును తప్పు పడుతూ కార్యక్రమాల్ని చేపట్టటంలో అర్థం లేదు. తాజాగా జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా.. అందుకు ప్రత్యామ్నాయంగా తమ సొంత పార్టీ ఆఫీసులో మాక్ అసెంబ్లీని నిర్వహించటం.. ఈ సందర్భంగా ప్రభుత్వం మీద విమర్శలు చేయటంలో అర్థమేంటి?అన్నది ప్రశ్న. అదేదో.. సభకు వచ్చి.. ప్రభుత్వాన్ని ఇరిటేట్ చేసేలా.. వారు ఇబ్బంది పడే అంశాలను చర్చకు తీసుకురావటం లాంటి వాటి మీద ఫోకస్ తగ్గించి..అందుకు భిన్నంగా వ్యవహరించటం వల్ల లాభమేంటి?అన్నది ప్రశ్న.నిజంగానే మాక్ అసెంబ్లీని నిర్వహించి.. ప్రభుత్వం తీరును ఎండగట్టాలన్నదే కేటీఆర్.. హరీశ్ రావు లాంటి వారి ఆలోచన అయితే.. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత.. ఇదే తెలంగాణ భవన్ లో ఇప్పటి మాదిరే సెట్టింగ్ వేసి.. ప్రభుత్వం వ్యవహరించిన తీరు.. అందుకు ప్రతిపక్షం ప్రదర్శించిన పాత్రను వ్యంగ్య రూపంలో చేసి ఉంటే బాగుండేది. అందుకు భిన్నంగా ఓవైపు అసెంబ్లీ జరుగుతుంటే.. అందులో పాల్గొనకుండా.. ఇలా మాక్ అసెంబ్లీని నిర్వహించటం తెలివైన పనిగా కనిపించదు. ఇలాంటి అంశాల్ని కేటీఆర్.. హరీశ్ రావులు ఎందుకు గుర్తించటం లేదన్నది అసలు ప్రశ్న. పిల్లలు తప్పులు చేస్తుంటే.. సరిదిద్దాల్సిన గులాబీ బాస్ సైతం గమ్మున ఉండటం దేనికి నిదర్శనం?

# కొండా రాజకీయం... అధిష్టానం రాయబారం.. నిజమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్ నాయకురాలు, ఎమ్మెల్యే తాజా మాజీ మంత్రి కొండా సురేఖకు పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చిందంటూ.. పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. ఆమెతో రాజీకి ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా వార్తలు వచ్చాయి. అయితే.. ఈ విషయంలో ఎలాంటి సమాచారం లేదని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధిష్టానం.. ఇప్పటి వరకు కొండా సురేఖను బుజ్జగించేలా ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని.. ఇకపై కూడా ఉండకపోవచ్చని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ తనయ.. సుస్మిత చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. దీంతో ఈ వ్యవహారం వివాదంగా మారింది. ఈ విషయంలో కుమార్తెను సమర్థించడం.. సీఎం రేవంత్‌పైనే ఎగస్పార్టీకంటే కూడా ఎక్కువగా స్పందించడంతో మొత్తంగా అధిష్టానం ఆమెను మంత్రి వర్గం నుంచి పక్కన పెట్టింది. ఇది జరిగి వారం పది రోజులు అయిపోయింది. అయితే.. అనూహ్యంగా.. అధిష్టానం.. కొండా సురేఖతో రాజీకి ప్రయత్నాలు ప్రారంభించిందని.. ఆమెను బుజ్జగిస్తోందని వార్తలువచ్చాయి. వీటిపై వివరణ ఇచ్చిన గాంధీ భవన్ అలాంటి సమాచారం తమకు లేదని పేర్కొనడం గమనార్హం. మరోవైపు.. కొండా సురేఖ..తన నెక్ట్స్ స్టెప్‌పై పార్టీ కార్యకర్తలు, తమ అనుచరులతో హనుమకొండలో ఆదివారం విందు సమావేశం నిర్వహించారు. దీనికి 200 మంది అనుచరులు వస్తారని అంచనా వేశారు. ఈ సమావేశంలో ఆమె తదుపరి నిర్ణయం ప్రకటించే వీలు ఉంటుందని తెలుస్తోంది. కాగా.. ప్రస్తుతం బీజేపీ, బీఆర్ ఎస్ వంటి పార్టీల్లో ఆమెకు అవకాశం లేకపోవడం.. కాంగ్రెస్ పార్టీలో దూరం పెట్టిన నేపథ్యంలో సురేఖ రాజకీయంగా ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం ఆమె ముందున్న ఏకైక ఆప్షన్.. కవిత పార్టీ టీఆర్ ఎస్ మాత్రమేనని పరిశీలకులు చెబుతున్నారు.

# 22ఏ మీద పొంగులేటి 227 నిమిషాల సుదీర్ఘ వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** అవునన్నా.. కాదన్నా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సంబంధం లేని అంశం నెత్తికి చుట్టుకొని చివరకు రేవంత్ ప్రభుత్వానికి ఒక తలనొప్పిలా మారింది. నిషేధిత జాబితా (22ఏ)లోకి పెద్ద ఎత్తున భూములు, ఆస్తులు చేరటం.. వాటిని అమ్మాలనుకున్న వారు.. అమ్ముకోలేని దుస్థితి ఏర్పడటం.. ఈ సమస్య తీవ్రతను గుర్తించే విషయంలో జరిగిన ఆలస్యానికి రేవంత్ సర్కారు తగిన మూల్యం చెల్లించుకుంటోంది. చివరకు తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం కంటే ప్రజలు.. వారి ఆగ్రహం వెరసి ప్రభుత్వానికి వారే ప్రధానప్రతిపక్షంగా మారారు. రేవంత్ సర్కారు పాలనలో ఇప్పటివరకు ఒక అంశం మీద ప్రజల్లో ఇంతటి వ్యతిరేకతను ఎదుర్కొని ప్రభుత్వం.. నష్టనివారణకు అసెంబ్లీని వేదికగా చేసుకుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శనివారం 227 నిమిషాల (మూడు గంటల 47 నిమిషాలు) సుదీర్ఘ వివరణను ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ.. తెలంగాణ రాష్ట్రంలోనూ ఒక అంశానికి సంబంధించి ఒక మంత్రి ఇంత సుదీర్ఘ వివరణ ఇచ్చిన సందర్భం ఇదేనన్న మాట అసెంబ్లీ లాబీల్లో వినిపించింది. ఆ మాటకు వస్తే దేశంలోనే మరే రాష్ట్ర మంత్రి కూడా ఇంత భారీ వివరణ ఇచ్చిన దాఖలాలు లేవన్న మాట రాజకీయ నేతల మాటల్లో వినిపించటం గమనార్హం.అసెంబ్లీలో తన సుదీర్ఘ వివరణ సందర్భంగా మంత్రి పొంగులేని.. తమ వైపు పొరపాటు జరిగిందని ఒప్పుకుంటూనే.. అందుకు కారణం గత ప్రభుత్వంగా పేర్కొంటూ బీఆర్ఎస్ అగ్రనేతలకు సంబంధించిన చిట్టాను విప్పి.. సరికొత్త అంశాల్ని తెర మీదకు తీసుకొచ్చారు. 22ఏ నిషేధిత జాబితాలో అధికారికంగా ఉండాల్సిన దానికి బదులుగా కొన్ని వందల రెట్లు ఎక్కువగా (సుమారు కోటి ఎకరాల భూమి) ఉండటానికి దారి తీసిన పరిస్థితులను వివరించి.. వాటిని సరిదిద్దుతున్నట్లుగా చెప్పారు. అదే సమయంలో సమస్య లేకున్నా.. సమస్య ఉన్నట్లుగా హరీశ్ తదితర నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఉదాహరణలతో సహా వివరిస్తూ.. ఉతికి ఆరేసే ప్రయత్నం చేశారు. అంతేకాదు.. ధరణి పోర్టల్ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి అంటూ సరికొత్త ఆరోపణలు చేసి..రాజకీయ అగ్గిని రాజేశారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్దిసేపు తొలగించి.. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారని.. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించినట్లుగా పేర్కొంటూ.. గత ప్రభుత్వం చేపట్టిన దోపిడీకి సంబంధించి తమకు భయంకరమైన ఆధారాలు లభించినట్లుగా సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొత్తం 13 వేల ఖాతాలకు 23 లక్షల ఎకరాల ఆస్తిని బదిలీ చేసినట్లుగా చెప్పి.. పెద్ద బాంబ్ పేల్చారు. దీనికి సంబంధించిన అంశాలు రానున్న రోజుల్లో భారీ రాజకీయ రగడకు కారణమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఏపీ నుంచే 22ఏ నిషేధిత భూముల వ్యవహారం అమల్లో ఉందన్న పొంగులేటి.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జాబితాలోని పేదల భూములు తొలగించలేదన్నారు. హైకోర్టు ఆదేశాలతో 2025లో ప్రభుత్వం 22ఏ జాబితాను అప్ లోడ్ చేసినట్లు చెప్పారు.అప్ లోడ్ చేయటానికి తెలంగాణ హైకోర్టు 45 రోజుల సమయం మాత్రమే ఇవ్వటంతో ధరణి.. అంతకు ముందు మార్పులు చేయని జాబితాను కలెక్టర్లు అప్ లోడ్ చేయటంతోనే సమస్య ఏర్పడినట్లుగా పేర్కొన్నారు. ఆ పొరపాటును సరిదిద్దామని చెప్పారు. అయినప్పటికి.. క్షేత్రస్థాయిలో మాత్రం మంత్రి పొంగులేటి చెప్పిన పరిస్థితి లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా.. 22ఏ మీద అసెంబ్లీలో మంత్రి పొంగులేటి ఇచ్చిన సుదీర్ఘ వివరణ సందర్భంగా అసలు 22ఏ నిషేధిత జాబితా పుట్టుక ఎలా జరిగిందన్న అంశాన్ని కూడా వివరించటం గమనార్హం.

మొత్తంగా చూస్తే.. సమస్య తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేసేందుకు అవసరమైన ముడి పదార్థాల్ని డేటా రూపంలో మంత్రి పొంగులేటి బాగానే సిద్ధం చేసుకున్నారని చెప్పాలి. ఇక్కడ ఆయన్ను అభినందించాల్సిన అంశం ఒకటి ఉంది. 22ఏ నిషేధిత జాబితాలో పొరపాట్లు జరిగాయన్న అంశాన్ని రెండు మూడు సార్లు ఒప్పుకోవటం. తప్పు జరగలేదని బుకాయించకుండా.. తప్పు జరిగిందని పేర్కొంటూ అందుకు అధికారుల తప్పిదంగా ఆయన పేర్కొన్నప్పటికి.. అంతకు మించిన డ్యామేజ్ తమ ప్రభుత్వానికి జరిగిందన్న విషయాన్ని లోలోనే దాచేసుకున్నారు. అయితే.. సమస్య పుట్టుక.. దానికి కారణాలు.. దాని తీవ్రత.. దానిమీద జరుగుతున్న రాజకీయ రచ్చల గురించి చెప్పిన మంత్రి పొంగులేటి.. సమస్యను నూటికి నూరు శాతం పరిష్కరించామన్న విషయాన్ని చెప్పలేదు. అంతేకాదు.. ఎప్పటికి సమస్య పూర్తిగా తొలగి.. మునుపటి పరిస్థితికి వస్తుందన్న విషయాన్ని చెప్పలేదన్న విమర్శ వినిపిస్తోంది.తాజా ఇష్యూలో ప్రధాన ప్రతిపక్షాన్ని బాధ్యుల్ని చేసేందుకు చూపించిన శ్రద్ధ.. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల మీద పెట్టి ఉండాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే.. తమకు తిప్పలు తెచ్చి పెట్టిన 22ఏ ఇష్యూను.. ప్రధాన ప్రతిపక్షం మీదకు ఒక అస్త్రంగా సంధించేందుకు అవసరమైన గ్రౌండ్ ను అసెంబ్లీ సాక్షిగా సిద్ధం చేసుకున్నారని చెప్పాలి. చూస్తుంటే.. 22ఏ ఇష్యూ రాజకీయ వేడిని మరింత రగల్చటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్ లో ప్రజలకు ఇక్కట్లు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే రేవంత్ సర్కారుకు తిప్పలు తప్పవు. మరేం జరుగుతుందో చూడాలి.

# బ్రిక్స్ గురించి జెన్ జెడ్ ఏమనుకుంటోంది?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ వేదికగా జరుగుతున్న 'బ్రిక్స్ సమ్మిట్' కేవలం అంతర్జాతీయ దౌత్య చర్చలకే పరిమితం కాకుండా.. సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తోంది. ప్రపంచ దేశాల అధినేతలు భారత్‌కు తరలిరావడంతో రాజధాని ఢిల్లీకి గ్లోబల్ లుక్ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ గ్లోబల్ ఈవెంట్‌పై ఓ జెన్ జెడ్ యువతి వ్యక్తం చేసిన అభిప్రాయాలు ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**'గ్లోబల్ వైబ్' ఆకట్టుకుంటోంది**

అంతర్జాతీయ రాజకీయాలు, దౌత్య వ్యూహాల కంటే కూడా సమ్మిట్ వల్ల దేశంలో కనిపిస్తున్న ప్రత్యేకమైన వాతావరణం తనకు ఎంతో నచ్చిందని ఆ యువతి తెలిపింది. ప్రపంచ వేదికపై భారత్ కేంద్ర బిందువుగా మారడం.. విదేశీ అధినేతల రాకతో దేశ రాజధానికి అంతర్జాతీయ మెరుపులు రావడం భారతీయులకు గర్వకారణమని పేర్కొంది.

**సంస్కృతి, ఆతిథ్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు**

బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలు కేవలం ఆర్థిక, రాజకీయ ఒప్పందాలకే కాకుండా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పడానికి గొప్ప అవకాశమని ఆమె అభిప్రాయపడింది. విదేశీ ప్రతినిధులకు భారతీయ ఆతిథ్య పరిమళాలు అందడంతో పాటు మన దేశ వైవిధ్యం ప్రపంచానికి మరింత దగ్గరవుతుందని వ్యాఖ్యానించింది.

**పెరుగుతున్న భారత్ గ్లోబల్ ఇమేజ్**

ప్రపంచంలో భారత్ పాత్ర రోజురోజుకూ కీలకమవుతోందనడానికి ఈ సమ్మిట్ ఒక నిదర్శనమని






యువతి స్పష్టం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో దేశ ఇమేజ్ పెరగడం యువతలో కూడా కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని ఆమె మాటల ద్వారా వ్యక్తమవుతోంది.

**సోషల్ మీడియాలో చర్చగా మారిన 'బ్రిక్సం' క్వశ్చన్**

ఈ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన మరో ఘట్టం చోటుచేసుకుంది. 'బ్రిక్సం' లో ఎన్ని దేశాలు ఉన్నాయని ప్రశ్నించగా ఆ యువతి "11 దేశాలు" అని సమాధానమిచ్చింది. ఈ క్లిప్ సోషల్ మీడియాలో రీల్స్‌గా మారి వైరల్ అయింది. బ్రిక్స్ సాంకేతిక, ఆర్థిక వివరాలపై పూర్తి అవగాహన లేకపోయినా... దేశ ప్రతిష్ఠ, సంస్కృతి, గ్లోబల్ వైబ్‌ను ఆమె ఆస్వాదించిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంది.

**జెన్ జెడ్ కొత్త కోణం**

సంప్రదాయ రాజకీయ విశ్లేషణలకు అతీతంగా జెన్ జెడ్ అంతర్జాతీయ ఈవెంట్లను ఎలా చూస్తోందో ఈ సంఘటన నిరూపిస్తోంది. దేశ భవిష్యత్తు, బ్రాండ్ ఇమేజ్, గ్లోబల్ ప్రెజెన్స్ వంటి అంశాలకు నేటి తరం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో చెప్పడానికి ఈ యువతి కామెంట్స్ ఒక ఉదాహరణగా నిలిచాయి.

# పవన్‌కు కేరళ సీఎం థ్యాంక్స్.. అసలు కథ ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేరళ పర్యటన ఇప్పుడు రాజకీయ అంశాల కంటే మరో కారణంతో ఆసక్తికరంగా మారింది. ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకున్న పవన్.. అక్కడి ప్రజల ఆతిథ్యం, ఆలయాల ప్రత్యేకతను ప్రశంసించడంతో కేరళ సీఎం వీడీ సతీశన్ స్పందించారు. పవన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

అయితే ఈ మొత్తం వ్యవహారాన్ని కేవలం ఇద్దరు రాజకీయ నేతల మధ్య జరిగిన సోషల్ మీడియా సంభాషణగా చూడాల్సిన అవసరం లేదు. పవన్ పర్యటన ద్వారా కేరళకు మరోసారి 'వెల్‌నెస్ డెస్టినేషన్'గా ప్రచారం లభించిందనే కోణం కూడా ఇప్పుడు చర్చకు వస్తోంది.

**రాజకీయ భేదాలకు అతీతంగా సాగిన పలకరింపు**

పవన్ కల్యాణ్ తన కేరళ పర్యటన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అక్కడి ప్రజలు చూపిన ఆప్యాయత, దయ, ఆతిథ్యం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. అలాగే త్రిప్రయార్ శ్రీరామ స్వామి, గురువాయూర్ శ్రీకృష్ణ, మామ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికుళంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను సందర్శించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ పర్యటన తనకు భక్తి, శాంతి, ప్రశాంతతను అందించిందని పవన్ పేర్కొన్నారు. తనకు సహకరించిన కేరళ సీఎం వీడీ సతీశన్, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ వ్యాఖ్యలకు సతీశన్ స్పందిస్తూ.. విశ్రాంతి, కోలుకోవడానికి కేరళను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కేరళ ప్రజల ఆప్యాయత, పురాతన ఆలయాల దర్శనం పవన్‌కు ప్రశాంతతను అందించాయని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పవన్ పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మరోసారి ఆయనకు కేరళలో ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

**'ఆయుర్వేదం' నుంచి 'వెల్‌నెస్ టూరిజం' వరకు..**

పవన్ కేరళలో అడుగుపెట్టడం వెనుక ప్రధాన కారణం రాజకీయ పర్యటన కాదు. భుజానికి శస్త్రచికిత్స అనంతరం తదుపరి చికిత్స కోసం ఆయన అక్కడ ఆయుర్వేద వైద్యం తీసుకుంటున్నారు. దీంతో ఆయన పర్యటనకు సహజంగానే కేరళ ఆయుర్వేదం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళకు ఇప్పటికే ఆయుర్వేదం, ప్రకృతి చికిత్స, యోగా, సంప్రదాయ వైద్య విధానాలు ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. దేశ, విదేశాల నుంచి వెల్‌నెస్ టూరిజం కోసం కేరళకు వచ్చే వారికి ఇవి కీలక కారణాలుగా నిలుస్తుంటాయి.

ఇలాంటి సమయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న పవన్ కల్యాణ్ స్వయంగా కేరళను చికిత్స, విశ్రాంతి కోసం





ఎంచుకోవడం.. ఆ రాష్ట్రానికి ఒక రకంగా ఆర్గానిక్ ప్రమోషన్ లాంటిదేనని చెప్పొచ్చు.

**ఆలయాలు.. ఆయుర్వేదం.. ఆతిథ్యం**

పవన్ పోస్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. ఆయన కేవలం చికిత్స గురించి మాత్రమే మాట్లాడలేదు. కేరళ ప్రజల ఆప్యాయతతో పాటు అక్కడి ఆలయాల గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంటే పవన్ పర్యటనలో మూడు అంశాలు ఒకేసారి హైలైట్ అయ్యాయి. ఆయుర్వేద చికిత్స, కేరళ సంప్రదాయం, ఆలయ పర్యాటకం.. ఇది కేరళ పర్యాటక రంగం ప్రచారం చేసే 'వెల్‌నెస్ కల్చర్' కాన్సెప్ట్‌కు కూడా దగ్గరగా ఉంటుంది. చికిత్స కోసం వెళ్లిన వ్యక్తి.. అక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కూడా ఆస్వాదించి ప్రశంసించడం ద్వారా కేరళకు ఉన్న బహుముఖ ఆకర్షణ మరోసారి తెరపైకి వచ్చింది.

**కాంగ్రెస్ సీఎం.. ఎన్డీయే నేత.. అయినా వ్యక్తిగత ఆత్మీయత**

ఇక ఈ సంభాషణకు మరో రాజకీయ కోణం కూడా ఉంది. వీడీ సతీశన్ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేత..పైగా సీఎం. పవన్ కల్యాణ్ ఏపీలో ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామి. దేశ రాజకీయాల్లో ఈ రెండు వర్గాలు అనేక అంశాలపై భిన్నమైన వైఖరులు తీసుకుంటుంటాయి. అయినప్పటికీ పవన్ ఆరోగ్యంపై కేరళ సీఎం ఆప్యాయంగా స్పందించడం.. పవన్ సైతం కేరళ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పడం.. రాజకీయాలకు అతీతంగా సాగిన మర్యాదపూర్వక సంభాషణగా నిలిచింది. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా ఆసక్తిని కలిగిస్తోంది. రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నప్పటికీ వ్యక్తిగత మర్యాద, రాష్ట్రాల మధ్య ఆతిథ్యం వంటి అంశాలకు చోటు ఉంటుందని ఈ వ్యవహారం మరోసారి చూపించింది.

**పవన్ పర్యటన కేరళకు ఎందుకు ముఖ్యమంటే..**

ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు ఏ రాష్ట్రానికి వెళ్లినా సాధారణంగా రాజకీయ భేటీలు, ప్రకటనలు, కార్యక్రమాలే వార్తల్లో నిలుస్తాయి. కానీ పవన్ విషయంలో మాత్రం చికిత్స, ఆధ్యాత్మికత, కేరళ ఆతిథ్యం ప్రధానంగా చర్చకు వచ్చాయి. అందుకే ఈ పర్యటనను కేవలం పవన్ కల్యాణ్ వ్యక్తిగత విశ్రాంతి పర్యటనగా చూడకుండా.. కేరళ తనకు ఉన్న సంప్రదాయ బలం, వైద్య విధానం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరోసారి ప్రపంచానికి చూపించుకున్న సందర్భంగా కూడా చూడొచ్చు. మొత్తానికి.. పవన్‌కు కేరళ సీఎం చెప్పిన 'థ్యాంక్స్' వెనుక రాజకీయ సమీకరణాల కంటే మానవీయ పలకరింపు, రాష్ట్ర ఆతిథ్యానికి వచ్చిన ప్రశంస, కేరళ ఆయుర్వేదానికి లభించిన ప్రచారం అనే మూడు అంశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# జగన్ పాదయాత్ర.. వైసీపీకి పాత రోజులు వచ్చేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ 2027 సెప్టెంబరు లేదా అక్టోబరులో పాదయాత్ర చేస్తానని ప్రకటించిన దరమిలా.. ఈ పాదయా త్రతో వైసీపీకి పునర్వైభవం వస్తుందా అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లోనే కాదు.. వైసీపీ నాయకుల్లోనూ చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా –పాదయాత్ర 2.0–ను నిర్వహించనున్నట్లు జగన్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ పాదయాత్ర ద్వారా.. తన ఇమేజ్‌ను పెంచుకోవడంతోపాటు.. వచ్చే ఎన్నికల్లో కూటమిని ఓడించి.. తాను అధికారంలోకి రావాలన్నది ఆయన పెట్టుకున్న ప్రధాన లక్ష్యం.

2024 ఎన్నికల ఓటమి తర్వాత ముఖ్యంగా సంక్షేమాన్ని భారీగా అమలు చేశామని చెప్పిన తర్వాత కూడా.. వైసీపీని ప్రజలు 11 స్థానాలకు పరిమితం చేశారు. దీంతో కేడర్ సహా నాయకులు నిరాశలో కూరుకుపోయారు. దీంతో జగన్ పాదయాత్ర నాయకుల్లో కొంత మేరకు జోష్ నింపుతుందని పార్టీ భావిస్తోంది. అయితే.. ఇప్పటికే పలు జిల్లాల్లోకీలక నాయకులు పార్టీ కాడి పడేసిన నేపథ్యంలో ఉన్న నాయకులకు కొత్తవారు తోడవుతారా? లేదా? అనేది చూడాలి. ఇక, ఈ యాత్ర ద్వారా కూటమి ప్రభుత్వ విధానాలు, హామీల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడం ద్వారా.. వైసీపీ పాలనను తిరిగి తెచ్చేందుకు జగన్ ప్రయత్నించే అవకాశం ఉంది.



**ఒకసారి చేస్తే..**

నిజానికి పాదయాత్రలు ఒక్కసారిఫలిస్తాయి. పదే పదే చేస్తే.. ప్రజలు ఏమేరకు విశ్వసిస్తారన్నది ప్రశ్నార్థకమే. గతంలో 2018–19 మధ్య జగన్ పాదయాత్ర చేశారు. ఒక్క ఛాన్స్ అన్నారు. అప్పట్లో ప్రజలు విశ్వసించారు. మరి ఆ తర్వాత ఐదేళ్ల పాలన చూశాకే కదా.. 11 స్థానాలకు పరిమితం చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా చేపట్టే పాదయాత్రపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చన్న వాదన కూడా వినిపిస్తోంది. అయతే.. గతంలో ప్రజాసంకల్ప యాత్ర ద్వారా జగన్ ప్రజలకు దగ్గరై అధికారంలోకి వచ్చారనే నమ్మకం పార్టీ క్యాడర్‌లో ఉంది. అదే ఇప్పుడు కూడా తమకు కలిసి వస్తుందన్న అంచనాలు వేసుకుంటోంది.

**ప్రతికూలాలు...**

వైసీపీ అధినేత జగన్ గత పాలనకు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు వ్యత్యాసం ఉంది. కేవలం పాదయాత్రతోనే ప్రజల మైండ్‌సెట్ మారుతుందా అనేది చెప్పలేని పరిస్థితి నెలకొంది. 2027లో యాత్ర ప్రారంభించి 2029 నాటికి ప్రజల్లో నిరంతరం ఉండాలనే వ్యూహం ఉన్నప్పటికీ, అప్పటి వరకు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతను ఏ స్థాయిలో నిలకడగా కొనసాగిస్తారనేది కీలకం. అదేసమయంలో జగన్ ఇచ్చిన సంక్షేమంతోపాటు.. అభివృద్ధి, ఉపాధికల్పన, ఉద్యోగాలు వంటివాటికి కూటమి సర్కారు ప్రాదాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో పాదయాత్ర ఏమేరకు సక్సెస్ అవుతుందన్నది.. పార్టీ పునర్వైభవాన్ని తెస్తుందా లేదా అనేది వేచి చూడాలి. మరోవైపు కూటమి పక్షాలు రోజు రోజుకు మరింత బలోపేతం అవుతుండడం గమనార్హం.

## సంచలనం : లాడెన్ టార్గెట్ హిట్ లిస్ట్ లో భారత్.. సీఐఏ పత్రాలు లీక్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచాన్ని కుదిపేసిన 9/11 దాడులకు మూడేళ్ల ముందే ఉగ్రవాద ముప్పుపై ప్రమాద ఘంటికలు మోగాయా? ఒసామా బిన్ లాడెన్ నేతృత్వంలోని అల్‌ఖైదా నెట్‌వర్క్ అమెరికాను మాత్రమే కాకుండా భారత్ సహా అనేక దేశాలను టార్గెట్‌గా పరిశీలించిందా? తాజాగా వెలుగులోకి వచ్చిన అమెరికా నిఘా పత్రాలు ఇప్పుడు ఈ ప్రశ్నలను తెరపైకి తెచ్చాయి.



ఇప్పటివరకు ఒసామా బిన్ లాడెన్ పేరు వినగానే ప్రధానంగా అమెరికాపై జరిగిన 9/11 దాడులే గుర్తుకొస్తాయి. కానీ అతడి వ్యూహం ఒక్క అమెరికాకే పరిమితం కాలేదని.. 1990ల చివరి నాటికే అనేక దేశాలను లక్ష్యంగా చేసుకునే స్థాయిలో అల్‌ఖైదా తన నెట్‌వర్క్‌ను విస్తరించిందని అమెరికా సీఐఏ పత్రాలు సూచిస్తున్నాయి. ఇందులో భారత్ పేరు ఉండటమే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**1998లోనే భారత్ పేరు**

1998 ఆగస్టు 28 నాటి 'బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎ థ్రెట్' పేరుతో రూపొందించిన ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్‌లో భారత్ ప్రస్తావన కనిపించింది. బిన్ లాడెన్ నెట్‌వర్క్ భారత్‌తో పాటు పాకిస్థాన్, ఈజిప్ట్, కువైట్, సౌదీ అరేబియా, యెమెన్, ఉగాండా, నైజీరియా వంటి దేశాల్లో దాడుల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే ఇక్కడ ఒక విషయం కీలకం. భారత్‌లో ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నారు? ఏ తేదీన దాడి చేయాలని భావించారు? ఏ తరహా ఆపరేషన్‌కు ప్లాన్ చేశారు? వంటి నిర్దిష్ట వివరాలు మాత్రం అందుబాటులోకి వచ్చిన పత్రాల్లో లేవు. అందువల్ల భారత్‌పై ఒక నిర్దిష్ట దాడి ప్రణాళిక సిద్ధమైందని చెప్పడం కంటే అల్‌ఖైదా లక్ష్యాల పరిధిలో భారత్ కూడా ఉన్నట్లు నిఘా సమాచారం సూచించింది.

**అసలు షాకింగ్ విషయం 'హిట్ లిస్ట్' మాత్రమే కాదు**

ఈ పత్రాల్లో భారత్ పేరు కనిపించడం ఒక కోణమైతే.. అంతకంటే ఆందోళన కలిగించే అంశం అప్పటికే అల్‌ఖైదా ఎంత విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకుందన్నదే. అఫ్గానిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై అమెరికా క్షిపణి దాడులు చేసినప్పటికీ బిన్ లాడెన్‌తో పాటు కీలక నేతలు తప్పించుకున్నారని అప్పటి నిఘా అంచనాలు పేర్కొన్నాయి. వారి కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలలేదని.. శిక్షణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించే సామర్థ్యం కూడా ఉందని హెచ్చరించాయి. అంటే అప్పటికే అల్‌ఖైదా ఒక ప్రాంతానికి పరిమితమైన ఉగ్రసంస్థగా కాకుండా.. వివిధ దేశాల్లోని అనుబంధ గ్రూపులు, వ్యక్తులు, మద్దతుదారులను ఉపయోగించుకొని ఎక్కడైనా దాడులు చేయగల అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్‌గా రూపాంతరం చెందుతోందని అమెరికా నిఘా వ్యవస్థ గుర్తించింది.

**హెచ్చరికలు వచ్చాయి.. కానీ 9/11ను ఆపలేకపోయారు**

తాజాగా బయటకు వచ్చిన పత్రాల్లో అత్యంత కీలకమైన అంశం ఇదే. 1998 నుంచి 2001 మధ్య బిన్ లాడెన్ నుంచి పెరుగుతున్న ముప్పు గురించి అప్పటి అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్‌లకు నిఘా సంస్థలు పలుమార్లు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. విమానాలను కేవలం ప్రయాణ సాధనాలుగా కాకుండా దాడులకు ఆయుధాలుగా ఉపయోగించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు కూడా అమెరికా నిఘా వ్యవస్థలో చర్చకు వచ్చినట్లు ఈ పత్రాలు సూచిస్తున్నాయి. కానీ చివరకు 2001 సెప్టెంబర్ 11న ప్రపంచం ఊహించని ఘోరం జరిగింది. అల్‌ఖైదాకు చెందిన 19 మంది ఉగ్రవాదులు నాలుగు ప్రయాణికుల విమానాలను హైజాక్ చేశారు. రెండు విమానాలు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌ను ఢీకొట్టాయి. మరో విమానం పెంటగాన్‌ను ఢీకొట్టగా నాలుగో విమానం పెన్సిల్వేనియాలో కూలిపోయింది. దాదాపు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

**భారత్ పేరు ఇప్పుడు ఎందుకు కీలకం?**

ఈ పత్రాలను కేవలం 'లాడెన్ హిట్ లిస్ట్‌లో భారత్' అనే సంచలన కోణం ఉన్నా అది అమలు కాలేదు.. 1990ల చివరి నాటికే అంతర్జాతీయ ఉగ్రవాదం సరిహద్దులను దాటి విస్తరిస్తోందని నిఘా సంస్థలు గుర్తించాయనడానికి ఇవి మరో సంకేతంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా భారత్ పేరు అప్పటి నిఘా నివేదికల్లో కనిపించడం.. అల్‌ఖైదా వ్యూహాత్మక దృష్టి ఎంత విస్తృతంగా ఉండేదో తెలియజేస్తోంది. అదే సమయంలో ఒక దేశం పేరు లక్ష్యాల జాబితాలో ఉండటం, ఆ దేశంలో నిర్దిష్ట దాడికి పూర్తి స్థాయి ఆపరేషనల్ ప్లాన్ సిద్ధం కావడం రెండూ ఒకటే కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**28 ఏళ్ల తర్వాత బయటపడిన పాత హెచ్చరిక**

1998లో అత్యంత రహస్యంగా అమెరికా అధ్యక్షుడి ముందుకు వెళ్లిన సమాచారం.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ప్రపంచం ముందుకు రావడంతో బిన్ లాడెన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరో అధ్యాయం తెరుచుకుంది. 9/11 తర్వాత ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని చూసే విధానమే మారిపోయింది. కానీ తాజా పత్రాలు మరో విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ఆ మహా విషాదానికి ముందే ప్రమాద సంకేతాలు కనిపించాయి. భారత్ సహా అనేక దేశాల పేర్లు నిఘా రాడార్‌పైకి వచ్చాయి. అసలు ప్రశ్న మాత్రం ఇప్పటికీ అలాగే ఉంది. ఆ హెచ్చరికలను అప్పట్లో మరింత తీవ్రంగా తీసుకుని ఉంటే చరిత్ర మరోలా ఉండేదా? అన్నదే ఇప్పుడు అందరినీ అనుకునేలా చేస్తోంది.

## సమావేశానికి గంట లేటు.. కేంద్ర మంత్రి ఏమన్నారంటే!

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా నాయకులు, మంత్రులు ఏదైనా సభలు సమావేశాలకు రావాలంటే.. షెడ్యూల్ ప్రకారం కుదిరేది కాదు కనీసంలో కనీసం.. అరగంట ఆలస్యమైతే తప్ప.. వారు వచ్చినట్టు ఉండదు.. జనాలు మెచ్చినట్టు కూడా ఉండద న్న నానుడి ఉంది. అయితే.. ఇటీవల కాలంలో సాంకేతికత పెరగడంతో ఈ సమయాభావం తగ్గుతూ వస్తోంది. అయినప్పటికీ.. కొన్ని సందర్భాల్లో మంత్రుల రాక ఆలస్యమవుతోంది.



కానీ.. అందరూ ఈ సమయాభావాన్ని లైట్ తీసుకుంటున్నారు.కానీ.. అందరిలో ఒక్కడిగా కాకుండా.. ప్రత్యేకంగా వ్యవహరించే కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. తాజాగా ఆదివారం ఉదయం మహారాష్ట్రలోని ఓ సమావేశానికి వచ్చారు. అయితే ఆయన షెడ్యూల్ ప్రకారం సమావేశానికి రాలేక పోయారు. గంటా 12 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు. సహజంగా ఇలాంటి సందర్భాల్లో మంత్రులు లైట్ తీసుకుంటారు. కానీ, గడ్కరీ మాత్రం.. తన ఆలస్యపై సుమారు 5 నిమిషాల పాటు పశ్చాత్తాపం ప్రకటించారు. దీనికి తాను మూల్యం చెల్లించుకున్నానని అన్నారు.ఇక, ఈ ఆలస్యానికి కారణం.. వర్లీ నుంచి ముంబైకి వచ్చే క్రమంలో ఏర్పడిన ట్రాఫిక్ జామేనని మంత్రి వివరించారు. కానీ, ఇది గతంలో తాను చేసిన తప్పు కారణంగానే జరిగిందన్నారు. తాను గతంలో మహారాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు.. రహదారులు, వంతెనల నిర్మాణం చేపట్టానని.. అయితే.. అప్పట్లో ఇంత భారీగా జనాలు పెరుగుతారని తాను ఊహించలేదని.. అందుకే.. కొంత మేరకు ఆయా నిర్మాణాల విషయంలో రాజీ పడాల్సి వచ్చిందని తెలిపారు.ఆనాడు తాను రాజీ పడడంతో ఇప్పుడు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా.. ప్రస్తుతం అధునాతన సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయని.. దీంతో నిర్మాణ సమయం తగ్గుతోందని.. అలాగే సాంకేతికత సాయంతో విస్తృతమైన పనులు కూడా జరుగుతున్నాయని వివరించారు. భవిష్యత్తులో చేపట్టే పనులకు.. ఈవిషయాలను పరిగణనలోకి తీసుకోవాలని గడ్కరీ సూచించారు. కాగా.. మంత్రి లేటుగా రావడం ఎలా ఉన్నా.. ఆయన 5 నిమిషాలకుపైగా తన వివరణ ఇవ్వడంతో సభికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## భారత్‌లో జిన్‌పింగ్‌కు కాలు నిలవలేదా..?!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ పర్యటనకు వచ్చిన చైనా అధ్యక్షుడు షి. జిన్‌పింగ్.. మీడియాలో హైలెట్ అయిన విషయం తెలిసిందే. రష్యా, దక్షిణాఫ్రికా సహా అనేక దేశాల నుంచి కూడా అధ్యక్షులు, ప్రధాన మంత్రులు ఢిల్లీలోని భారత మండపంలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఒక రోజు ముందే అంటే.. శుక్రవారమే(శనివారం నుంచి బ్రిక్స్) వచ్చారు. కానీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాత్రం శనివారం ఉదయం 11 గంటలకు బీజింగ్ నుంచి ఢిల్లీకి వచ్చారు. అప్పటికే సదస్సు ప్రారంభమైపోయింది.ఇక, ఆయన కనీసం 24 గంటలు కూడా భారత్‌లో ఉండలేకపోవడం.. గమనార్హం. శనివారం జరిగిన తొలి రోజు సెషన్‌లో పాల్గొన్నా.. పెద్దగా మనసు పెట్టలేక పోయారని.. జాతీయ మీడియా భావిస్తోంది. అనంతరం.. ఆయన ఆదివారం ఉదయం ప్రధాని మోడీ సహా.. బ్రిక్స్ దేశాల అధినేతలతో కలిసి భారత మండపం వద్ద ఫొటోలు దిగారు. వాస్తవానికి ఈ ఫొటో సెషన్ తర్వాత.. రెండో రోజు.. సదస్సు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, జిన్ పింగ్ కాలు నిలవలేదు. ఆ వెంటనే ఆయన బీజింగ్ దిశగా విమానం ఎక్కేశారు.

**హైలెట్ అయింది.. బ్రిక్స్ కాదా?**

ఇక, చైనా అధ్యక్షుడి విషయంలో భారత మీడియా అతిగా స్పందించిందన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి బ్రిక్స్ సదస్సును భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించింది. దీనికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఢిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడం సాధారణ పౌరులు కూడా ఇబ్బంది పడ్డారు. ఇంత ప్రతిష్టాత్మక కార్యక్రమంలో శనివారం ఉదయం వరకు బాగానేకవరేజీ ఇచ్చిన భారత మీడియా.. చైనా అధ్యక్షుడు వాలడంతో ఫోకస్ అంతా ఆయనపైనే ఉంచింది. ఆయన చుట్టూనే కథనాలు వండి వార్చింది.

**ఎందు కింత ప్రాధాన్యం..**

చైనా అధ్యక్షుడు ఏడు సంవత్సరాల తర్వాత.. భారత పర్యటనకు వచ్చారు. మరీ ముఖ్యంగా గాల్వాన్ లోయ(సరిహద్దు)లో జరిగిన ఘర్షణ తర్వా.త. ఆయన రావడం ఇదే తొలిసారి. అయితే.. చైనాభారత్ దేశాల మధ్య కొన్ని చిక్కులు ఉన్నప్పటికీ.. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో మార్కెట్ విషయంలో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే జిన్‌పింగ్ రాకకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే.. మీడియా ఇంత కవరేజీ ఇవ్వడం.. పై మాత్రం విమర్శలు వస్తున్నాయి.

## మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారు.. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సంచలన ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆరోగ్యం, ఆయన మనుగడపై అంతర్జాతీయంగా సాగుతున్న అనేక ఊహాగానాలు, వార్తలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తెరదించారు. అమెరికా దాడుల్లో మొజ్తబా ఖమేనీ మరణించారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని.. ఆయన సజీవంగానే ఉంటూ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. భారత్‌లో జరుగుతున్న 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూఢిల్లీ వచ్చిన పెజెష్కియాన్ 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ అంశంపై అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు.మొజ్తబా ఖమేనీ ప్రస్తుతం ఎక్కడున్నారనే విషయాన్ని అమెరికా నిఘా వర్గాలు గుర్తించలేకపోతున్నాయని.. ఆ అసమర్థత వల్లే ఆయన మరణించారంటూ ప్రచారం చేస్తోందని పెజెష్కియాన్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రజల్లో తీవ్ర గందరగోళం సృష్టించడం.. ఇరాన్ నాయకత్వంపై ఒత్తిడి పెంచడం లక్ష్యంగానే ప్రత్యర్థులు ఇటువంటి దుష్ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు. భద్రతాపరమైన కారణాల దృష్ట్యా ఆయన ఆచూకీ.. ప్రస్తుత స్థానానికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయలేమని, నాయకత్వ భద్రత తమకు అత్యంత ప్రాధాన్య అంశమని వెల్లడించారు.ఇరాన్ అత్యున్నత నాయకత్వ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ద్వారా ఆ దేశంలో రాజకీయ అస్థిరతను సృష్టించేందుకు ప్రత్యర్థి దేశాలు ప్రయత్నిస్తున్నాయని పెజెష్కియాన్ అన్నారు. తమ దేశంలోని కీలక నాయకులను సైనిక దాడుల ద్వారా భౌతికంగా దెబ్బతీయడమే కాకుండా.. మీడియా వేదికగా నిరంతరం ఇన్ఫర్మేషన్ వార్ నడుపుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొడుతూ తమ నాయకత్వం బలంగా ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మొజ్తబా ఖమేనీ మరణించారనే ప్రచారాన్ని ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా నేరుగా ఖండించడం ద్వారా అంతర్జాతీయంగా సాగుతున్న అనేక సందేహాలకు స్వస్తి చెప్పే ప్రయత్నం చేసింది. అయితే ఆయన ప్రస్తుత స్థానం లేదా ప్రత్యక్ష ఆధారాలను ఇరాన్ గోప్యంగా ఉంచడంతో ఈ అంశంపై అంతర్జాతీయ దౌత్య వేదికలపై చర్చ కొనసాగే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ అధ్యక్షుడు పెజెష్కియాన్ చేసిన ఈ ప్రకటన అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న సమాచార, దౌత్యపరమైన ఉద్రిక్తతలకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది.

# చిత్రం గురూ: నీకోసం కోట్లు ఖర్చు పెట్టా.. తిరిగిచ్చేయ్.. లవర్‌పై కోర్టులో కేసు!



ఇదో చిత్రమైన ఘటన.. బహుశ ఎక్కడా ఇలాంటి ఘటన వెలుగు చూసి ఉండకపోవచ్చు. రీజనేంటంటే..ప్రేమలో తలమునకలు గా మునిగిన క్షణంలో ప్రేయసి కోసం.. ఎంత పేద ప్రేమికుడైనా అంతో ఇంతో ఖర్చు పెడతాడు. ఒకవేళ ఆ ప్రేమ వికటించి.. ప్రియురాలు కాదు పొమ్మన్నా... మనసులోనే ఆవేదన వ్యక్తం చేసేవారు.. చాలా మంది. కసితో రగిలేవారు మరికొందరు ఉన్నారు. కానీ, "నీ ప్రేమ పోతే పోనీ.. నీ కోసం.. చేసిన ఖర్చును మాత్రం తిరిగి ఇచ్చేయ్" అని అడిగే ప్రేమికుడు ఉంటాడా? ఇప్పటి వరకు అయితే.. ఇలాంటి కేసులు వెలుగు చూడలేదు.

ఇప్పుడు తాజాగా ఇలాంటి చిత్రమైన కేసు వెలుగు చూసింది. ప్రేయసి కోసం.. 3కోట్ల 50 లక్షల రూపాయలు ఖర్చుచేశానని.. ఇప్పుడు ఆమె తన ప్రేమను కాదందని.. కాబట్టి.. ఆమె కోసం ఖర్చు చేసిన అన్ని సొమ్ములు తిరిగి ఇచ్చేయాలని ఓ ప్రియు డు.. భీష్మించాడు. కేవలం భీష్మించడమే కాదు.. ఏకంగా కోర్టును కూడా ఆశ్రయించాడు. చిత్రమైన ఈఘటన మన దేశంలో కాకపోయినా.. సింగపూర్‌లో జరిగింది. అయితే.. సదరు ప్రేమికుడు మన భారత దేశానికి చెందిన వ్యక్తే కావడం గమనార్హం.

**ఏం జరిగింది?**

భారత్‌లోని యూపీకి చెందిన చందన్ అగర్వాల్.. సింగపూర్‌లో లాజిస్టిక్ కంపెనీలో సీఈవో ఉద్యోగం నిమిత్తం వెళ్లి.. అక్కడే సెటిల్ అయ్యారు. ఈ క్రమంలో ఆయనకు ఫెలిసియా లీ(జర్మనీ)తో పరిచయం అయింది. ఇలా.. మొదలైన వారి స్నేహం.. 2019 నుంచి 2023 వరకు సాగింది. ఈ క్రమంలో ప్రియురాలు కోరిందని.. అనేక రూపాల్లో ఆయన ఖర్చు చేశారు. అయితే.. అనంతరం.. లీ వేరేవారి వలలో పడిందన్నది అగర్వాల్ ఆరోపణ. అంతేకాదు.. తనతో ఆమె కటీఫ్ చెప్పిందని అగర్వాల్ చెబుతున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య రాజీ కాకపోవడంతోపాటు దూరం మరింత పెరిగింది.

ఈ నేపథ్యంలోనే అగర్వాల్.. తనను కాదన్న ప్రేయసి నుంచి ఖర్చుల మొత్తం వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిని ఆమె తిరస్కరించింది. దీంతో.. ఆయన సింగపూర్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రేయసిపై ఖర్చు చేసిన మొత్తాన్నీ తిరిగి ఇవ్వా లని ఆయన కోరుతున్నారు. అయితే.. ఈ కేసును న్యాయ వ్యవస్థ పట్టించుకోదని భావిస్తున్న అగర్వాల్.. పదరు ప్రేయసికి తాను రూ.3.5 కోట్లను అప్పుగా ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కేసును తాజాగా కోర్టు విచారణకు స్వీకరించింది. మరి ఎలాంటి తీర్పు ఇస్తుందో చూడాలి.

# బ్రిక్స్: 45 పేజీలు.. 140 పేరాల ఢిల్లీ డిక్లరేషన్ 'సారం' ఇదే




ప్రపంచం ఎదురుచూసిన సందర్భం రానే వచ్చింది. అందరి అంచనాలకు మించి అద్భుతమైన దౌత్య విజయాన్ని భారత్ తన ఖాతాలో వేసుకుంది. 11 పూర్తిస్థాయి సభ్య దేశాలు.. 10 భాగస్వామ్య దేశాలు.. మొత్తంగా 21 దేశాలు పాల్గొన్న బ్రిక్స్ 2026 సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ ఏడాది ఢిల్లీ వేదికగా భారత్ ఈ సదస్సుకు అతిథ్యాన్ని ఇచ్చింది. వచ్చే ఏడాది చైనా వేదికగా ఈ సదస్సు జరగనుంది. వైరుధ్యమైన దేశాల నడుమ.. ఏకాభిప్రాయాన్ని తీసుకురావటం అంత తేలికైన విషయం కాదు. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా ఉంటూ.. అదే సమయంలో చైనా లాంటి పొరుగుదేశాన్ని డీల్ చేయటం.. ఆహ్లాదవాతావరణంలో కార్యక్రమాన్ని పూర్తి చేయటం ఒక ఎత్తు అయితే.. అమెరికా మిత్రుడు కన్నెర్ర చేయకుండా జాగ్రత్తలు తీసుకోవటం కత్తి మీద సామే అవుతుంది.ఓవైపు అమెరికా – ఇరాన్ యుద్ధం జరుగుతున్న వేళ.. ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఈ సదస్సుకు హాజరయ్యారు. మరోవైపు ఉక్రెయిన్ తో యుద్ధం చేస్తున్న రష్యా అధ్యక్షుడు.. భారత్ కు సహజ మిత్రుడు పుతిన్ కూడా హాజరయ్యారు. అంటే.. యుద్ధాలు చేస్తున్న రెండు దేశాలకు చెందిన అధ్యక్షులు ఒక సదస్సుకు రావటం.. వారు అమెరికాకు శత్రువులుగా ఉండటం.. వారికి అతిథ్యమిచ్చిన భారత్ అగ్రరాజ్యానికి మిత్రుడిగా ఉండటం లాంటి పరిణామాల్ని చూస్తే.. ఈ సదస్సు నిర్వహణ.. విజయవంతంగా పూర్తి చేయటం సర్కస్ విన్యాసానికి ఏ మాత్రం తీసిపోదని చెప్పాలి.

బ్రిక్స్ సదస్సులో అత్యంత కీలకమైన డిక్లరేషన్ కు అందరి ఆమోదం పొందటం ఇప్పుడు అందరిని ఆకర్షిస్తోంది. బ్రిక్స్ లోని అన్ని దేశాలు ఏకాభిప్రాయంతో ఆమోదించిన ఈ డిక్లరేషన్ ను ఢిల్లీ డిక్లరేషన్ గా వ్యవహరించనున్నారు. మొత్తం 45 పేజీల్లో 140 పేరాల్లో ఉన్న ఈ విస్తృత ప్రకటనకు సభ్య దేశాలన్నీ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఆమోదించాయి. ఇంతకూ 140 పేరాల్లోని అంశాలేంటి? అన్న విషయంలోకి వెళితే.. ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. ఈ మొత్తం 140 పేరాల్ని కుదించి.. అంశాల వారీగా చూస్తే మొత్తం పది అంశాలుగా కనిపిస్తాయి. ఇది మన వెసులుబాటు కోసం చేసుకుంటున్న విభజన అన్నది మర్చిపోకూడదు.

1. ప్రపంచ పాలన సంస్కరణలు (ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి, ప్రపంచ దక్షిణానికి ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వాలి)
2. శాంతి, భద్రత, ఉగ్రవాదం (ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, సంఘర్షణల పరిష్కారం, సౌర్వభమత్వం)
3. ఆర్థిక వ్యవస్థ.. ప్రపంచ ఆర్థిక సంస్థలు (ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సంస్కరణలు)
4. వాణిజ్యం.. పెట్టుబడులు (ఏకపక్ష సుంకాలు.. వాణిజ్య అడ్డంకులు.. సప్లై చైన్.. పరస్పర పెట్టుబడులు)
5. సాంకేతిక.. ఏఐ (కృత్రిమ మేధస్సు.. డిజిటల్ పరివర్తన.. సాంకేతిక అంతరాన్ని తగ్గించటం)
6. ఇంధనం.. వాతావరణ మార్పు (ఇంధన భద్రత.. పునరుత్పాదక ఇంధనం.. వాతావరణ ఆర్థిక సాయం)
7. ఆరోగ్యం.. ఆహార భద్రత (ఆరోగ్య సహకారం.. మహమ్మారుల సన్నద్ధత.. ఆహార భద్రత)
8. అభివృద్ధి.. సామాజిక సంక్షేమం (పేదరికం.. ఉపాధి.. మహిళలు.. యువత.. విద్య)
9. ప్రజల మధ్య సంబంధాలు (టూరిజం.. కల్చర్.. క్రీడలు.. విద్యార్థుల మార్పిడి)
10. బ్రిక్స్ సంస్థాగత నిర్మాణం (కొత్త సభ్యులు.. బ్రిక్స్ వ్యవస్థను బలోపేతం చేయటం.. నిరంతర సహకారం)

ఇప్పుడున్న పరిస్థితుల్లో భిన్నధ్రువాలుగా ఉండే దేశాలు ఒక తాటి మీదకు రావటం.. కొన్ని అంశాల మీద ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లటం మామూలు విషయం కాదు. మొత్తం 140 పేరాల్లో 139, 140 పేరాల్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. ఎందుకంటే.. 139వ పాయింట్ లో బ్రిక్స్ కు భారత ఛైర్మన్ షిప్ ను అందరూ ప్రశంసిస్తే.. 140 పేరాలో 2027లో బ్రిక్స్ ఛైర్మన్ షిప్ ను చైనాకు అప్పగించేందుకు అందరూ మద్దతు ఇవ్వటం. తాజా సమ్మిట్ లో అందరూ ఒప్పుకునేలా డిక్లరేషన్ చేయటం అంత తేలికైన విషయం కాదు.

ఇక్కడే భారత దౌత్యవేత్తల చతురత కనిపిస్తుంది. అదెలా అంటే.. వేదిక మీద ఉన్న భారత్, చైనా, రష్యా, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, బ్రెజిల్, ఇండోనేషియా, ఈజిప్టు, ఇథోపియా, సౌతాఫ్రికా దేశాల వ్యూహాలు.. వ్యూహాత్మక ప్రయోజనాలు భిన్నమైనవన్నది మర్చిపోకూడదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇరాన్ కు యూఏఈకి అస్సలు పడదు. భారత్ – చైనా గురించి చెప్పాల్సిన అవసరం లేదు. వీరిద్దరి ప్రయోజనాలు వేరు. భారత్ – రష్యా దేశాల మధ్య సహజ మిత్రత్వం ఉన్నప్పటికి.. మధ్యలో అమెరికా పాత్రను విస్మరించలేం. ఇలా భిన్న ధ్రువాలు ఉన్నప్పటికి ఏకాభిప్రాయానికి రావటమే ఆసక్తికర అంశం.

ఇదెలా సాధ్యమైందన్న ప్రశ్నకు సమాధానాన్ని వెతికితే ఒక కీలక అంశం కనిపిస్తుంది. అత్యంత వివాదాస్పద అంశాలకు ఒకేలాంటి భాషను వాడకుండా కొన్ని కీలక పదాల్ని తెలివిగా జొప్పించటమే కారణం. సుంకాల ప్రస్తావన తెచ్చారే కానీ యూఎస్ పేరును తెర మీదకు తీసుకురాలేదు. డాలర్ స్థానంలో బ్రిక్స్ కరెన్సీ అనే కన్నా.. స్థానిక కరెన్సీలతో మార్పిడి చేసుకుందామని సున్నితంగా చెప్పటం కనిపిస్తుంది. గ్లోబల్ సౌత్ అజెండాను ప్రపంచానికి చెప్పే క్రమంలో భారత నాయకత్వం బ్రిక్స్ లో పెద్ద సర్కసే చేసింది.

అదెలా అంటారా? చైనాను తక్కువ చేయకుండా.. రష్యాను సంతృప్తి పరుస్తూ.. ఇరాన్ తో మాట్లాడుతూనే.. యూఏఈని ఇబ్బందికి గురి చేయకుండా.. అమెరికాకు ఆగ్రహం కలగకుండా ఉండేలా ప్లాన్ చేయటమే తాజా సక్సెస్ కు అసలు కారణం. మొత్తంగా చూస్తే మోడీ నాయకత్వంలో భారత్ సాధించిన అద్భుత దౌత్య విజయంగా చెప్పాలి. కొందరు ఒప్పుకోరు కానీ బ్రిక్స్ సదస్సు ఇంతలా సక్సెస్ కావటంలో మోడీ పిల్లర్ లా నిలిచారని చెప్పాలి. ఎందుకంటే.. సమకాలీన కాలంలో ఒక భారత దేశ ప్రధాని తన పదవీ కాలంలో చైనా అధ్యక్షుడ్ని దాదాపు 21 సార్లు కలిశారు. వేదికలు ఏవైనా ఇన్నిసార్లు కలవటం.. ఇరు దేశాలకు సంబంధించిన నిర్ణయాత్మక స్థాయిలో ఉండటంతో వ్యక్తిగత నమ్మకాలకు.. స్నేహానికి అవకాశం ఉంటుంది. ఇలాంటివి కొన్నిసార్లు లాభదాయకంగా మారుతుంటాయి. బ్రిక్స్ సదస్సు దీనికి ఒక ఉదాహరణ.

2024 కజాన్ సమావేశం తర్వాత భారత్––చైనా సంబంధాల్లో మెరుగుదల మొదలైంది. తాజా బ్రిక్స్ సదస్సు నాటికి ఒక స్థాయికి చేరుకోవటమే కాదు.. ప్రాశ్చాత్య దేశాలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చేందుకు కారణమైంది. నిజానికి.. ఈ సదస్సు బ్రిక్స్ కు మాత్రమే కాదు.. అంతర్జాతీయ వేదికపై భారత ప్రధాని మోడీ నాయకత్వానికి, భారత దౌత్య సామర్థ్యానికి మరింత గుర్తింపు తీసుకొచ్చే పరిణామంగా మారింది. భిన్నప్రయోజనాలు ఉన్న బ్రిక్స్ సభ్యులను 140 పాయింట్లు ఉన్న పత్రం మీద సంతకం చేయించటం ఆసక్తికర పరిణామం. అదెలా సాధ్యమైంది? అన్న ప్రశ్నకు సమాధానం వెతికితే పలు అంశాలు కనిపిస్తాయి.

ఢిల్లీ డిక్లరేషన్ లో ప్రపంచ పాలనా సంస్కరణలకు సంబంధించిన కీలక అంశాల్ని ప్రస్తావించారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణకు వాయిదా వేయకూడదని.. నిర్దిష్ట కాలపరిమితలో స్పష్టమైన ఫలితాలు ఉండాలన్న వాదనను భారత్ బలంగా వినిపించింది. ఐఎంఎఫ్.. ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థల్లో ఇప్పటి ఆర్థిక వ్యవహారాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలన్న వాదనను భారత్ వినిపించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దగా తోడ్పడుతున్న దేశాలకు నిర్ణయాత్మక స్థానాలు రావాలన్న మాటతో పాటు.. ప్రపంచ దక్షిణ దేశాల ప్రాధాన్యతను ప్రత్యేకంగా ప్రస్తావించటం కీలక అంశం.

ఇప్పటివరకు పశ్చిమ దేశాల నియమాలను పాటించే దక్షిణ దేశాలుగా కాకుండా.. నియమాలు రూపొందించే స్థాయికి ఎదగాలని.. ఆ దిశగా గుర్తింపు లభించాలన్న ఆకాంక్ష భారత్ నోటి నుంచి రావటం ముఖ్యమైన అంశం. బ్రిక్స్ దేశాల మధ్య నావికులకు అత్యవసర సహాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన భారత్ నుంచి వచ్చింది. ఇది చాలా ప్రత్యేకమైన ప్రతిపాదనగా చెబుతున్నారు. బ్రిక్స్ సదస్సు లో తీసుకున్న నిర్ణయాల అమలు అంశాన్ని పరిశీలించే వ్యవస్థ అవసరాన్ని భారత్ సూచన చేసింది. దీన్ని తెర మీదకు తీసుకురావటం ద్వారా.. బ్రిక్స్ భవిష్యత్తుకు ఒక రోడ్ మ్యాప్ ను భారత్ సిద్ధం చేసినట్లైంది.

బ్రిక్స్ ఢిల్లీ సదస్సు విజయవంతం కావటానికి మరో కీలక అంశం కూడా ఉంది. చైనా.. రష్యా ప్రాధాన్యతలను తగ్గించకుండా జాగ్రత్తలు తీసుకోవటం. ప్రాశ్చత్య అధిపత్యం తగ్గటం.. బహుళధ్రువ ప్రపంచం..ప్రపంచ దక్షిణానికి ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వటం.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ సంస్కరణ.. వాణిజ్య రక్షణాత్మక చర్యలకు వ్యతిరేకత.. ఏకపక్ష ఆంక్షలకు వ్యతిరేకత.. స్థానిక కరెన్సీ వినియోగం (డాలర్ మీద ఆధారపడటాన్ని తగ్గించటం)లాంటివి ఉన్నాయి. అదే సమయంలో రష్యాకు సానుకూల అంశాలు ఉండటంతో.. బ్రిక్స్ సదస్సు సక్సెస్ అయ్యింది.

కొన్ని విశ్లేషణలను పరిశీలించినప్పుడు.. 140 పేరాలను భారత్, చైనా ప్రయోజనాల కోణంలో విడివిడిగా అంచనా వేస్తే ఆసక్తికరమైన చిత్రం కనిపిస్తుంది. ఇవేమీ అధికారిక లెక్కలు కావు. పలు విశ్లేషణలు.. అంచనాల్ని పరిశీలించి చూస్తే.. ఒకే అంశం భారత్‌కూ, చైనాకూ అనుకూలంగా ఉండే సందర్భాలు ఉన్నాయి. భారత ప్రయోజనాలకు స్పష్టంగా అనుకూలంగా ఉన్న అంశాలు గణనీయంగా ఉండగా.. చైనా ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్న అంశాలు కూడా తక్కువేమీ కావు. అదే సమయంలో.. ఇరు దేశాలకూ కొంతమేర అనుకూలంగా ఉండే అంశాలు, ప్రతికూల ప్రభావం చూపే అంశాలు ఉన్నాయి. ఇరు దేశాలకూ దాదాపు తటస్థంగా ఉండే అంశాలకు కొదవలేదు. మొత్తంగా చూస్తే.. ఢిల్లీ డిక్లరేషన్ ఏ ఒక్క దేశ ప్రయోజనాల కోసం రూపొందిన పత్రం కాదని.. పరస్పర ప్రయోజనాలను సర్దుబాటు చేసుకుంటూ ఏకాభిప్రాయానికి వచ్చిన పత్రంగా చూడాల్సి ఉంటుంది.

ఢిల్లీ డిక్లరేషన్ ద్వారా భారత్ కు బాగా లాభం చేకూరే కీలక అంశం.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు. ఇది భారత్ కు
ఒక పెద్ద విజయం. ఎందుకంటే.. తాజా డిక్లరేషన్ లో భారత్, బ్రెజిల్ కు అంతర్జాతీయ వ్యవస్థలో పెద్ద పాత్ర ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించారు. దీనికి చైనా ఓకే చెప్పటమే అసలు విజయం. ఎందుకంటే.. చైనా మాత్రమే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశం ఆసియాకు చెందిన చైనా మాత్రమే ఉంది. ఇప్పటికే పలుమార్లు భారత్ కు భద్రతా మండలిలో చోటు కల్పించాలన్న చర్చ వచ్చినా.. చైనా బహిరంగంగా తన సానుకూలతను వ్యక్తం చేయలేదు. తాజాగా అది సాధ్యమైంది. పహల్గామ్ ఉగ్రదాడిని చైనా ఖండించింది. పాకిస్తాన్ పేరును ప్రస్తావించలేదు కానీ.. ఉగ్రవాదంపై ఎలాంటి సమర్థన ఉండకూడదని స్పష్టం చేసింది. భారతదేశ నాయకత్వంలో బ్రిక్స్ వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్యం ముందుకు వెళ్లటంలో భారతదేశ పాత్ర కీలకమని ప్రత్యేకంగా అభినందించటం భారత్ కు ఘన విజయంగా చెప్పాలి.

మరి.. చైనాకు లాభం కలిగించిన అంశాల విషయానికి వస్తే.. ఏకపక్ష ఆంక్షలకు వ్యతిరేకం (సుంకాల వద్దన)గా పేర్కొనటం.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అనుమతి లేని ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు.. ద్వితీయ ఆంక్షలను డిక్లరేషన్ తీవ్రంగా వ్యతిరేకించటం చైనాకు లాభం చేకూరుస్తుంది. బహుళ ధ్రువ ప్రపంచం కూడా చైనాకు లాభాన్ని తీసుకొచ్చేదే. అమెరికా ఆధిపత్యం ఉన్న ఏకధ్రువ వ్యవస్థకు బదులుగా అనేక శక్తి కేంద్రాలుండే ప్రపంచాన్ని డిక్లరేషన్ పేర్కొంది.గ్లోబల్ సౌత్ కు పెద్దపీట వేయటం.. బ్రిక్స్ దేశాల స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు.. సరిహద్దు చెల్లింపు వ్యవస్థల అనుసంధానం డిక్లరేషన్ లో ప్రస్తావించటం చైనాకు.. రష్యాకు మేలు కలిగించేవి. మొత్తంగా చూస్తే.. ఇచ్చిపుచ్చుకునే విధానాన్ని విజయవంతంగా పూర్తి చేయటమే బ్రిక్స్ 2026 సదస్సు సూపర్ సక్సెస్ కు కారణంగా చెప్పొచ్చు.

దిల్లీలో జరిగిన బ్రిక్స్ 2026 సదస్సు 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించడంతో, ఆతిథ్య దేశంగా భారత్ ఎదుర్కొన్న పరీక్షకు సానుకూల ఫలితం లభించినట్టే. సభ్యదేశాల మధ్య తీవ్ర భౌగోళిక-రాజకీయ విభేదాలున్న తరుణంలో, ఉమ్మడి ప్రకటనను రూపొందించడమే పెద్ద సవాలు. అందులో ముఖ్యంగా ఉగ్రవాదంపై కూటమి తీసుకున్న కఠిన వైఖరి భారత్‌కు దౌత్యపరమైన విజయంగా చెప్పుకోవచ్చు. కారణం, ఉద్దేశం ఏదైనప్పటికీ ఉగ్రవాద చర్యలను ఏమాత్రం సమర్థించలేమని బ్రిక్స్ దేశాలు స్పష్టం చేయడంతోపాటు, 26మంది ప్రాణాలు బలిగొన్న 2025 ఏప్రిల్ 22నాటి జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిని అత్యంత తీవ్ర పదజాలంతో ఖండించడం గమనార్హం. గతంలో ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై పహల్గాం దాడిని నేరుగా ప్రస్తావించడంలో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం భారత్‌కు కష్టతరంగా ఉండేది, ముఖ్యంగా చైనా, పాకిస్థాన్‌తో దాని సన్నిహిత సంబంధాల నేపథ్యంలో. ఈసారి డిక్లరేషన్‌లో ఈ దాడిని ప్రత్యేకంగా ప్రస్తావించడం, ఉగ్రవాదాన్ని ఏ మతం, జాతీయత, నాగరికతతోనూ ముడిపెట్టకూడదని స్పష్టం చేయడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలను అంగీకరించబోమని పేర్కొనడం భారత్ దీర్ఘకాలంగా అంతర్జాతీయ వేదికలపై వినిపిస్తున్న వాదనలకు బలం చేకూర్చింది. ఉగ్రవాదానికి అందుతున్న ఆర్థిక సాయం, సరిహద్దుల ఆవల నుంచి సాగుతున్న కార్యకలాపాలు, ఆశ్రయం కల్పించే చర్యలను ఉమ్మడిగా ఎదుర్కొంటామని పునరుద్ఘాటించడం కూడా ఈ దిశగా భారత్ చేసిన దౌత్యపరమైన కృషికి నిదర్శనం.

అయితే కేవలం ఉగ్రవాదంపై వైఖరి ఆధారంగానే భారత్ తన పరీక్షలో పూర్తిగా నెగ్గిందని చెప్పలేం. డిక్లరేషన్‌లో ప్రస్తావించిన ఇతర అంశాలను పరిశీలిస్తే, భారత్ అనేక సున్నిత విషయాల్లో సభ్యదేశాల మధ్య సమతుల్యతను సాధించాల్సి వచ్చిందని స్పష్టమవుతుంది. పాలస్తీనా అంశంపై బ్రిక్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, గాజాలో కాల్పుల విరమణను కొనసాగించాలని, పాలస్తీనియన్ల బలవంతపు తరలింపులను వ్యతిరేకిస్తూ, రెండు దేశాల సిద్ధాంతానికి మద్దతు పలకడం చూస్తే, ఇజ్రాయెల్‌తో సాన్నిహిత్యం పెంచుకుంటున్న భారత్‌కు ఇది కొంత ఇబ్బందికరమైన అంశమే. అయినప్పటికీ, ఆక్రమిత జెరూసలేం స్థితిని మార్చే ఏకపక్ష చర్యలను వ్యతిరేకించడం, పవిత్ర స్థలాల గౌరవాన్ని కాపాడాలని కోరడం వంటి అంశాల్లో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో భారత్ విజయం సాధించింది. ఇక ఆర్థిక రంగంలో, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో సంస్కరణలు, కోటా మార్పులు, డబ్ల్యూటీఓ బలోపేతం వంటి డిమాండ్లలో భారత్ ప్రయోజనాలకు అనుగుణంగానే డిక్లరేషన్ రూపొందింది. అయితే డీ-డాలరైజేషన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తం చేసిన అనుమానాలు, బెదిరింపుల నేపథ్యంలో, డిక్లరేషన్‌లో ఏకపక్ష సుంకాలు, రక్షణవాదంపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, నేరుగా అమెరికాను రెచ్చగొట్టే భాషను నివారించడం భారత్ దౌత్యనీతికి పరీక్షగానే మిగిలింది. ఏకపక్ష ఆర్థిక ఆంక్షలను ఖండిస్తూ, క్యూబాపై ఆంక్షల ఎత్తివేతకు మద్దతు పలకడంవంటి అంశాలు చైనా, రష్యా ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉన్నప్పటికీ, అమెరికాతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని చూస్తున్న భారత్‌కు ఇవి ఇబ్బందికరమైన సమతుల్యతా

## భారత్‌కు ఊరట!

సాధనగా మిగిలాయి.

మొత్తంగా చూస్తే, న్యూఢిల్లీ డిక్లరేషన్ భారత్‌కు పాక్షిక విజయాన్నే అందించిందని చెప్పవచ్చు. ఉగ్రవాదంపై కఠిన వైఖరి, పహల్గాం దాడి ప్రస్తావన వంటి అంశాల్లో భారత్ తన లక్ష్యాన్ని సాధించగలిగినా, పాలస్తీనా, అమెరికా సుంకాలు, డాలర్ ఆధిపత్యంవంటి సున్నిత అంశాల్లో అన్ని సభ్యదేశాల ప్రయోజనాలను సమతుల్యం చేయాల్సి వచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సురక్షితంగా, అందరినీ కలుపుకొనిపోయేలా అభివృద్ధి చేయాలన్న డిమాండ్, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం అవసరమన్న అంశం, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న ఆకాంక్ష వంటివి అన్ని సభ్యదేశాలకూ ఆమోదయోగ్యమైన సాధారణ లక్ష్యాలుగా మిగిలాయి. ఇవి వివాదాస్పదం కానందున సులభంగా ఏకాభిప్రాయం సాధించగలిగారు. మహిళలకు, గ్లోబల్ సౌత్‌కు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 1325 అమలుకు కట్టుబడి ఉండటం వంటివి కూడా భారత్ ప్రాధాన్యతలకు అనుగుణంగానే ఉన్నాయి. అయితే నిజమైన పరీక్ష డిక్లరేషన్‌లోని మాటలు ఆచరణలో ఎంతమేర అమలవుతాయన్నదే. ఉగ్రవాదంపై కఠిన వైఖరి కాగితాలపై కనిపించినా, దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సభ్యదేశాల చిత్తశుద్ధి ఎంత అన్నదే అసలైన ప్రశ్న. చైనా, రష్యావంటి దేశాలు తమ సొంత భౌగోళిక-రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాద అంశాన్ని ఎంతమేర సీరియస్‌గా తీసుకుంటాయన్నది భవిష్యత్తులో తేలాల్సిన విషయం. అయితే ప్రస్తుతానికి, విభిన్న ప్రయోజనాలు కలిగిన 11 దేశాల కూటమిని ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకురాగలగడం, ముఖ్యంగా తనకు అత్యంత ముఖ్యమైన ఉగ్రవాద వ్యతిరేక వైఖరిపై స్పష్టమైన మాటలు రాబట్టగలగడం భారత దౌత్యనీతిలో ఒక ముఖ్యమైన విజయంగానే చెప్పవచ్చు. ఈ దృష్టితో చూస్తే, న్యూఢిల్లీ డిక్లరేషన్‌తో భారత్ తన ఆతిథ్య బాధ్యతలో ఎదురైన కఠిన పరీక్షను చాలావరకు విజయవంతంగానే పూర్తి చేసింది.

ఉగ్రవాదంపై కఠిన వైఖరి, పహల్గాం దాడి ప్రత్యేక ప్రస్తావన భారత్‌కు గణనీయమైన దౌత్యపరమైన విజయమే. ఏ కారణమైనా ఉగ్రవాదాన్ని సమర్థించలేమని, ద్వంద్వ ప్రమాణాలు అంగీకరించమని కూటమి స్పష్టం చేయడం భారత్ దీర్ఘకాలంగా వినిపిస్తున్న వాదనకు బలం చేకూర్చింది. అయితే సున్నిత విషయాల్లో సభ్యదేశాల ప్రయోజనాలను సమతుల్యం చేయాల్సి రావడం.. ఇజ్రాయెల్‌తో సాన్నిహిత్యం పెంచుకుంటున్న భారత్‌కు ఇబ్బందికరమే. నిజానికి -అసలైన పరీక్ష ఇప్పుడే మొదలవుతుంది. డిక్లరేషన్‌లోని మాటలు క్షేత్రస్థాయిలో ఎంతమేర అమలవుతాయో చూడాలి. పాకిస్థాన్‌తో సన్నిహిత సంబంధాలున్న చైనా, రష్యా ఉగ్రవాద అంశాన్ని ఎంత చిత్తశుద్ధితో తీసుకుంటాయన్నదే కీలకం. మొత్తానికి, విభిన్న ప్రయోజనాలు కలిగిన 11 దేశాల కూటమిని ఏకతాటిపైకి తీసుకురాగలగడం భారత దౌత్యనీతికి ముఖ్యమైన విజయమే. అయితే వాగ్దానాలు ఆచరణలో రూపుదిద్దుకోవడమే నిజమైన కొలమానమని మర్చిపోకూడదు.

### పనికొచ్చే పలుకు



## ప్రేమకు హద్దులు.. క్రమశిక్షణకు అర్థం

పిల్లలు పడిపోతారేమోనని ఎప్పుడూ చేయి పట్టుకుంటే.. వారు నడవడం నేర్చుకుంటారు కానీ, ఒంటరిగా నిలబడటం నేర్చుకోలేరు. జీవితంలో ఎక్కడా ఓటమి ఎదురుకాకుండా కాపాడితే.. విజయం విలువ కూడా తెలియదు. అందుకే పిల్లల పెంపకంలో ప్రేమ ఎంత ముఖ్యమో.. క్రమశిక్షణా అంతే ముఖ్యం. ప్రేమ పేరుతో ప్రతి కోరిక తీర్చడం, ప్రతి తప్పును సమర్థించడం, ప్రతి కష్టాన్ని వారి నుంచి దూరం చేయడం మంచి పేరెంటింగ్ కాదు. ప్రేమతో పాటు బాధ్యతను నేర్పడం, స్వేచ్ఛతోపాటు హద్దులను చూపించడం, వారి మాట వినడంతోపాటు అవసరమైనప్పుడు 'కాదు' అని చెప్పడం.. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి. అందుకే 'అథారిటేటివ్ పేరెంటింగ్' అనే విధానం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇందులో తల్లిదండ్రులు పిల్లలపై కఠినమైన నియంతృత్వాన్ని ప్రదర్శించరు. అదే సమయంలో ఏది చేసినా సరేనని వదిలేయరు. పిల్లల భావాలను వింటారు.. అభిప్రాయాలను గౌరవిస్తారు.. అవసరమైన నియమాలను మాత్రం స్పష్టంగా చెబుతారు. ఉదాహరణకు ఫోన్ వాడకానికి సమయం నిర్ణయించడం, చదువు-ఆటలకు సమతుల్యత పాటించడం, ఇంటి పనుల్లో చిన్న బాధ్యతలు అప్పగించడం, తప్పు చేస్తే దాని పరిణామాన్ని అనుభవించే అవకాశం ఇవ్వడం వంటివి పిల్లల్లో బాధ్యతా భావాన్ని పెంచుతాయి. ముఖ్యంగా 'నువ్వు తప్పు చేశావు కాబట్టి నిన్ను ప్రేమించడం లేదు' అనే భావనకు బదులుగా.. 'నీపై నాకు ప్రేమ ఉంది, కానీ ఈ ప్రవర్తన మాత్రం సరైంది కాదు' అనే సందేశాన్ని ఇవ్వడం ఎంతో ప్రభావవంతంగా ఉంటుంది.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. క్రమశిక్షణ అంటే శిక్ష కాదు. భయపెట్టి మాట వినిపించడం కాదు. పిల్లలను అందరి ముందు అవమానించడం అసలే కాదు. క్రమశిక్షణ అంటే సరైనది-తప్పు మధ్య తేడాను అర్థం చేసుకునేలా చేయడం. ఒక పని చేయకపోతే దాని ఫలితం ఏమిటో ముందుగానే చెప్పడం. చెప్పిన నియమాలను తల్లిదండ్రులు కూడా స్థిరంగా పాటించడం. ఒకరోజు అనుమతించి, మరుసటి రోజు అదే పనికి కోపగించుకోవడం పిల్లల్లో గందరగోళాన్ని సృష్టిస్తుంది. కాబట్టి నియమాలు తక్కువగా ఉన్నా.. స్పష్టంగా, స్థిరంగా ఉండాలి. పిల్లలకు కష్టాలు తెలియకుండా పెంచడం కంటే.. చిన్న చిన్న కష్టాలను ఎదుర్కొనేలా చేయడం మంచిది. ఓడినప్పుడు వెంటనే ఓదార్చడం మాత్రమే కాదు.. ఎందుకు ఓడిపోయారో ఆలోచించేలా చేయాలి. పని ఆలస్యమైనప్పుడు తల్లిదండ్రులే పూర్తి చేయడం కాకుండా.. కొంత సమయమిచ్చి వారు పూర్తి చేసేలా ప్రోత్సహించాలి. కోరిన వస్తువు వెంటనే ఇవ్వకుండా.. దాని విలువను అర్థం చేసుకునేలా చేయాలి. ఇలా చిన్న చిన్న అనుభవాలే భవిష్యత్తులో పెద్ద సవాళ్లను ఎదుర్కొనే శక్తిగా మారతాయి. నిజానికి మంచి పేరెంటింగ్ లక్ష్యం 'మన పిల్లలు ఎప్పుడూ మనపై ఆధారపడాలి' అనేది కాదు.. 'ఒకరోజు మన సహాయం లేకుండానే ధైర్యంగా జీవించగలగాలి' అనేదే. ప్రేమతో పెంచాలి.. కానీ బలహీనంగా కాదు. నియమాలు పెట్టాలి.. కానీ నిర్దయగా కాదు. పిల్లల మాట వినాలి.. కానీ ప్రతి కోరికను అంగీకరించాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రుల ప్రేమకు క్రమశిక్షణ తోడైతేనే అది పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తిగా మారుతుంది. ఈ మార్పు పిల్లల భవిష్యత్తును మాత్రమే కాదు.. ఇంటి వాతావరణాన్ని, తల్లిదండ్రుల అలవాట్లను, చివరకు మొత్తం కుటుంబ జీవనశైలినీ ఆరోగ్యకరంగా మార్చగలదు.

పిల్లల దారిలోని ప్రతి ముల్లును తల్లిదండ్రులే తొలగిస్తే.. జీవితంలో వచ్చే ముళ్లను ఎలా ఎదుర్కోవాలో వారు ఎప్పుడు నేర్చుకుంటారు? ప్రేమతో చేయి పట్టుకోవాలి.. కానీ ప్రతి అడుగూ మనమే వేయకూడదు; క్రమశిక్షణతో నడవడం నేర్పినప్పుడే పిల్లలు జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోగలరు.

# యుద్ధానికి 'హూతీ'ల మలుపు!



యెమెన్‌లోని దక్షిణ టిహామా ప్రాంతంలో హూతీ తిరుగుబాటుదారులు అనూహ్యంగా మెరుపు వేగంతో ముందుకుదూసుకెళ్లడం అంతర్జాతీయ పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటివరకు హూతీలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ఎర్రసముద్ర తీరంలోని ఎడారి మైదాన ప్రాంతమైన టిహామాలో ఎక్కువ భాగాన్ని తన ఆధీనంలో ఉంచుకున్న నేషనల్ రెసిస్టెన్స్ కూటమి, కేవలం కొద్దిరోజుల వ్యవధిలోనే ఆ భూభాగాన్ని కోల్పోయింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన 130 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని ఇరాన్ మద్దతున్న ఈ తిరుగుబాటుదారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారని అంచనాలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లలో హూతీలు సాధించిన అతిపెద్ద సైనిక విజయాల్లో ఇది ఒకటి. 12 ఏళ్లుగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, సౌదీ అరేబియా జరిపిన భారీ వైమానిక దాడులు, అమెరికా-ఇజ్రాయెల్-బ్రిటన్ దళాల ప్రత్యక్ష దాడులు ఎదురైనప్పటికీ హూతీలు ఒక బలమైన శక్తిగానే మిగిలారని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ప్రత్యర్థులు షాక్‌కు గురై, ధైర్యం కోల్పోయిన పరిస్థితుల్లో, హూతీలు తాము గెలుచుకున్న భూభాగంలో వేగంగా తమ స్థావరాలను పటిష్టం చేసుకుంటున్నారని బ్రస్సెల్స్‌కు చెందిన విశ్లేషకుడు హిషామ్ అల్-ఒమిసీ అభిప్రాయపడ్డారు. హూతీలను కేవలం ఇరాన్ చేతిలో కీలుబొమ్మలుగా చూడటం సరికాదని, అయితే లెబనాన్‌లోని హిజ్బుల్లా, గాజాలోని హమాస్, సిరియాలోని అసద్ ప్రభుత్వంవంటి 'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' మిత్రపక్షాలు వరుస ఎదురుదెబ్బలు చవిచూసిన నేపథ్యంలో, ఇరాన్ తన మద్దతును పూర్తిగా హూతీలవైపు మళ్లించిందని ఆయన విశ్లేషించారు. ఇరుపక్షాలకూ ఈ మద్దతు పరస్పరం అవసరమైన తరుణంలో, హూతీల విజయాలు ఇరాన్ వ్యూహంలో భాగంగానే జరుగుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది.

ఈ పరిణామాలు కేవలం యెమెన్ అంతర్గత సంఘర్షణకే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన వాణిజ్యంపైనే తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై భారీ దాడులు ప్రారంభించి ఏడు నెలలు గడిచిన తర్వాత, ఇరాన్‌కు ప్రపంచంలోని రెండు అత్యంత కీలకమైన సముద్రమార్గాలపై అనూహ్యంగా పట్టు లభించింది. పర్షియన్ గల్ఫ్ ప్రవేశద్వారం వద్ద ఉన్న హోర్ముజ్ జలసంధి, ఎర్రసముద్రానికి, సూయజ్ కాలువకు వెళ్లే ప్రధాన మార్గమైన బాబ్ అల్-మందేబ్ జలసంధి. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఇంధన, చమురు వాణిజ్యంలో 35 శాతానికి పైగా ఈ రెండు మార్గాలపైనే ఆధారపడి ఉండటంతో, నేరుగా తనకు మద్దతిచ్చే వర్గాల ద్వారా పరోక్షంగా ఈ మార్గాలను ఇరాన్ నియంత్రించగలగడం అణుబాంబు కలిగి ఉన్నంత వ్యూహాత్మక శక్తినిస్తుందని లండన్‌కు చెందిన చాథమ్ హౌస్ పరిశోధకుడు ఫరియా అల్-ముస్లిమీ అభిప్రాయపడ్డారు. ఎర్రసముద్రంలోని పెరిమ్‌వంటి కీలక దీవులను కూడా హూతీలు స్వాధీనం చేసుకుంటే, అంతర్జాతీయ నౌకా రవాణాకు ఆటంకం కలిగించే వారి సామర్థ్యం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్-గాజా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచే హూతీలు ఎర్రసముద్రంలో ప్రయాణించే నౌకలపై క్షిపణులు, డ్రోన్లు, చిన్నస్థాయి పడవల ద్వారా దాడులు చేస్తూ, ఆ ప్రాంతాలను భౌతికంగా స్వాధీనం చేసుకోకుండానే నౌకా రవాణాను నియంత్రించగలిగారని యెమెన్ ఎక్స్‌పర్ట్ ఐయోనా క్రెయిగ్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో సంబంధమున్న నౌకలనే లక్ష్యంగా చేసుకుంటున్నామని హూతీలు చెబుతున్నా, గతంలో నార్వే జెండాతో ప్రయాణించిన చమురు ట్యాంకర్‌పై కూడా దాడి జరగడం, ఈ ప్రకటనలో వాస్తవికత ఎంత అనే సందేహాలను లేవనెత్తుతోంది. అయితే 2025లో అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ రఫ్ రైడర్' వంటి భారీ ప్రతిదాడులను మళ్లీ ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో హూతీలు అన్ని నౌకలపైనా విచక్షణారహితంగా దాడి చేయకపోవచ్చని క్రెయిగ్ అభిప్రాయపడ్డారు.

ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో అమెరికా పాత్ర అనిశ్చితంగా మారింది. ఇరాన్‌తో ఇప్పటికే సాగుతున్న యుద్ధానికి అమెరికా ప్రజల్లో పెద్దగా మద్దతులేని తరుణంలో, చమురు ధరలు మళ్లీ పెరుగుతున్న సమయంలో మరో కొత్త యుద్ధరంగాన్ని తెరవడం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజకీయంగా లాభదాయకం కాదు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అవకాశాలపైనా ఇది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలంటూ సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ చేసిన విజ్ఞప్తులకు అమెరికా నుంచి ఇప్పటివరకు స్పష్టమైన స్పందన రాలేదు. యెమెన్‌లో పెరుగుతున్న ఘర్షణపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, సౌదీ అరేబియాకు మద్దతును పెంచేందుకు ప్రయత్నిస్తూ, ప్రత్యక్ష సైనిక జోక్యానికి మాత్రం దూరంగా ఉండాలని అమెరికా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. అయితే సౌదీ అరేబియాను భయపెడుతున్నది కేవలం బాబ్ అల్-మందేబ్‌కు ఎదురయ్యే ముప్పు మాత్రమే కాదు, హోర్ముజ్ జలసంధి మూతపడిన తర్వాత చమురు ఎగుమతికి కీలక ప్రత్యామ్నాయంగా మారిన సౌదీ ఈస్ట్-వెస్ట్ చమురు పైప్‌లైన్‌పై కూడా హూతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్టు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంవల్ల ఇప్పటికే ఏర్పడిన ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ దాడి జరిగినట్టు కనిపిస్తోంది. ఇరాన్ నేరుగా ఆదేశాలివ్వకపోయినా, దీనివల్ల లాభపడేది మాత్రం ఇరానే. 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత ఇంతటి తీవ్రస్థాయి ఘర్షణలు చోటుచేసుకోవడం ఇదే తొలిసారని లండన్‌కు చెందిన విశ్లేషకుడు బరా షైబాన్ పేర్కొన్నారు. జూలైలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హూతీ ప్రతినిధి బృందం హాజరైన తర్వాతే ఈ పరిణామాలు వేగం పుంజుకున్నాయన్నది తాజా విశ్లేషణ. యెమెన్ మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం అంచుకు చేరుకుంటుండగా, సౌదీ అరేబియా తన ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఎర్రసముద్ర మార్గాన్ని కాపాడుకోవడంపై తీవ్ర ఆందోళన చెందుతోంది. ట్రంప్ ఈ ఘర్షణలో జోక్యం చేసుకోవడానికి ఇష్టపడకపోవడంతో ఇరాన్-అమెరికా ఘర్షణ మరింత సంక్లిష్టమైన, ప్రమాదకరమైన కొత్త దశలోకి ప్రవేశించింది. అయితే ఈ భౌగోళిక-రాజకీయ పోరులో అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం సామాన్య యెమెన్ ప్రజలే. 12 ఏళ్లుగా సాగుతున్న అంతర్యుద్ధంతో ఇప్పటికే నిరాశ్రయులైన, బాంబు దాడులకు గురైన, ఆకలితో అలమటిస్తున్న, పేదరికంలో మగ్గుతున్న లక్షలాది మంది జీవితాలను ఈ తాజా పరిణామాలు మరింత దుర్భరం చేసే ప్రమాదం కనిపిస్తోంది. ■



బాధ వచ్చినప్పుడు కొందరు కుంగిపోతారు.. మరికొందరు అదే బాధను తమ ఎదుగుదలకు మెట్టుగా మార్చుకుంటారు. ఉదాహరణకు, పరీక్షలో విఫలమైన విద్యార్థి ఆ ఓటమినే జీవితాంతం మోస్తే ముందుకు సాగలేడు. కానీ తన తప్పులను గుర్తించి, మరింత కష్టపడి తిరిగి ప్రయత్నిస్తే అదే వైఫల్యం విజయానికి బాటవుతుంది. మనసుకు గాయం కావడం కొన్ని క్షణాలే.. కానీ దాన్ని బాధగా మోసుకెళ్లాలా, అనుభవంగా మార్చుకోవాలా, బలంగా నిలబడాలా అనేది పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## ట్రంప్ ఆకారంలో ఎక్స్‌టసీ మాత్రలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖ ఆకారంలో తయారైన ఎక్స్‌టసీ మాత్రలు ఇప్పుడు ఆందోళనకు కారణమవుతున్నాయి. వీటిలో ప్రాణాంతక ప్రభావాలకు దారితీసే నెమ్మదిగా పనిచేసే మత్తు పదార్థం ఉన్నట్టు నెదర్లాండ్స్‌కు చెందిన ట్రింబోస్ ఇన్‌స్టిట్యూట్ హెచ్చరించింది. ప్రభావం ఆలస్యంగా కనిపించడంతో వినియోగదారులు మరో మాత్ర తీసుకునే ప్రమాదం ఉందని, ఫలితంగా మోతాదు మించి తీసుకుని ప్రాణాపాయానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపింది.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..




మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

### ఆహారాల్లో తేడాలే కారణం..

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బొహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

### ప్రోబయోటిక్స్ ఆపేయాలా..

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

### ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయో మ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

# విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా ? నిపుణులు ఏం చెబుతున్నారంటే..

ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల తయారీ, డీఎన్‌ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది.

### నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి..

నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నరాలపై ఉండే మైలిన్ అనే రక్షణ పొరను నిర్వహించడంలో ఇది సహాయపడుతుంది. ఈ రక్షణ పొర సరిగ్గా ఉంటే మెదడు, వెన్నుపాము, శరీరంలోని ఇతర భాగాల మధ్య విద్యుత్ సంకేతాలు సక్రమంగా ప్రసారం అవుతాయి. బి12 లోపం ఏర్పడినప్పుడు నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎర్ర రక్త కణాల తయారీలోనూ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి ప్రభావితమై మెగాలోబ్లాస్టిక్ అనీమియా వంటి సమస్యలు ఏర్పడతాయి. దాంతో శరీరానికి ఆక్సిజన్ సరఫరా సరిగా జరగక అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి కూడా బి12 అవసరం. ఈ విటమిన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన లోపం ఉన్నప్పుడు మరింత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

### ఆందోళన పెరుగుతుందా..

విటమిన్ బి12 లోపం ఆందోళన లక్షణాలను పెంచడానికి ఒక కారణం అవుతుందని చెబుతున్నారు. శరీరంలో బి12 తక్కువగా ఉన్నప్పుడు మెదడు పనితీరుకు అవసరమైన కొన్ని రసాయన ప్రక్రియలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని మెథియోనిన్‌గా మార్చే ప్రక్రియలో బి12 అవసరం. ఈ ప్రక్రియ మెదడు పనితీరు, మానసిక స్థితి నియంత్రణకు సంబంధించిన జీవరసాయన చర్యల్లో భాగం. బి12 లోపం వల్ల అలసట, బలహీనత, మెదడు మబ్బుగా అనిపించడం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇవి రోజువారీ పనితీరుపై ప్రభావం చూపడంతో కొందరిలో ఆందోళన మరింత ఎక్కువగా అనిపించే అవకాశం ఉంటుంది. అలాగే నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్నిసార్లు పానిక్ అటాక్ లక్షణాలను పోలి ఉంటాయి.

### ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు శారీరక లక్షణాలతోపాటు నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. తీవ్రమైన అలసట, బలహీనత, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి సమస్యలు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన, చిరాకు, డిప్రెషన్, మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించిన ప్రతిసారీ బి12 లోపమే కారణమని భావించకూడదు. ఆందోళనకు అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. కొంతమందిలో విటమిన్ బి12 లోపం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పూర్తిగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారిలో బి12 లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. సహజంగా బి12 లభించే మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణం. వయసు పెరిగే కొద్దీ బి12 శోషణ తగ్గే అవకాశం ఉన్నందున వృద్ధుల్లోనూ లోపం కనిపిస్తుంది.

### జీర్ణ వ్యవస్థ సమస్యలు ఉంటే..

జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలోనూ ఆహారం నుంచి బి12 శరీరంలోకి శోషించుకోవడం తగ్గుతుంది. అలాగే మెట్‌ఫార్మిన్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులను దీర్ఘకాలం ఉపయోగించే వారు కూడా బి12 స్థాయిలపై వైద్యుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బి12 లోపం ఉన్నవారికి లోపాన్ని సరిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే బి12 స్థాయిలు సాధారణంగా ఉన్న ప్రతి ఒక్కరూ అదనంగా బి12 సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. సాధారణ బి12 స్థాయిలు ఉన్నవారిలో కేవలం సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా ఆందోళన గణనీయంగా తగ్గుతుంది. ఎప్పటికప్పుడు లేదా నిరంతరం ఆందోళనగా అనిపించడం, కారణం తెలియని తీవ్రమైన అలసట, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు, సమతుల్యతలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలంగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారు బి12 స్థాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

### వైద్య పరీక్షలు అవసరం..

విటమిన్ బి12 లోపం కొన్ని సందర్భాల్లో ఆందోళనను పోలిన లక్షణాలకు లేదా నాడీ సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది. అయితే ఆందోళనకు బి12 లోపమే ఏకైక కారణమని చెప్పలేం. లక్షణాలను బట్టి సరైన వైద్య పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. బి12 లోపం నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా దాన్ని సరిచేసుకోవాలి.




# భోజనం చేశాక పండ్లను తినాలా.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?

భోజనం తర్వాత పండ్లు తినడం ఆరోగ్యకరమైన అలవాటుగా చాలామంది భావిస్తారు. ముఖ్యంగా మామిడి, యాపిల్, బొప్పాయి వంటి పండ్లను భోజనం అనంతరం స్వీట్లకు ప్రత్యామ్నాయంగా తీసుకోవడం సాధారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో పులిసిపోయి గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తాయనే వాదనలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఈ వాదనల్లో వాస్తవం ఎంత? నిజంగా పండ్లను ఎప్పుడు తింటే మంచిది? నిపుణుల సూచనల ప్రకారం ఇలా ఉన్నాయి. భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో కుళ్లిపోతాయనే వాదనకు శాస్త్రీయ ఆధారం లేదు. మన కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉంటుంది. దీని ఆమ్లత్వం కారణంగా కడుపులో పండ్లు బ్యాక్టీరియా ద్వారా పులిసిపోయే పరిస్థితి ఉండదు. అయితే పండ్లను కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు అధికంగా ఉన్న భోజనం తర్వాత తీసుకుంటే కడుపు ఖాళీ కావడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది. ఇది జీర్ణక్రియలో సహజమైన ప్రక్రియే తప్ప, ఏదైనా సమస్యకు సంకేతం కాదు.

### పీచు పదార్థంతో మేలు..

పండ్లలో ఉండే కరిగే పీచు పదార్థం, ముఖ్యంగా యాపిల్, సిట్రస్ పండ్లలో లభించే పెక్టిన్, కడుపు నుంచి ఆహారం బయటకు వెళ్లే వేగాన్ని కొంత తగ్గిస్తుంది. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే ఆహారంలోని పోషకాలు శరీరంలోకి క్రమంగా శోషించేందుకు ఇది సహాయపడుతుంది. వేగంగా రక్తంలో చక్కెర పెరగకుండా కూడా పీచు కొంతవరకు సహకరిస్తుంది. అయితే భోజనంతోపాటు లేదా వెంటనే పండ్లు తినడం వల్ల ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే వాటిలోని సహజ చక్కెరలు చిన్న ప్రేగులకు వేగంగా చేరుతాయి. భోజనం తర్వాత పండ్లు తింటే ప్రధాన ఆహారంలోని పీచు, ప్రోటీన్, కొవ్వు కారణంగా జీర్ణక్రియ కొంత నెమ్మదిస్తుంది. ఫలితంగా ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి ఇది సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల విషయంలోనూ పండ్లను భోజనంతో కలిపి తీసుకోవడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా టైప్-2 మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు పండ్లను ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంత నియంత్రణలో ఉండే అవకాశం ఉంటుంది. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆహార ఎంపికలు మారుతాయి.

### సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

మరోవైపు సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి మాత్రం భోజనం చేసిన వెంటనే ఎక్కువ మొత్తంలో పండ్లు తినడం అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా పుచ్చకాయ, బేరి, ద్రాక్ష వంటి ఫ్రక్టోజ్ అధికంగా ఉండే పండ్లను ఇప్పటికే నిండుగా ఉన్న కడుపుపై ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే గ్యాస్, పొట్ట ఉబ్బరం, అసౌకర్యం వంటివి కనిపిస్తాయి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారిలో ఈ సమస్య మరింత స్పష్టంగా ఉంటుంది. భోజనంతో పాటు పండ్లు తీసుకోవడం వల్ల మరో ప్రయోజనం కూడా ఉంటుంది. విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, జామ, కివీ వంటి పండ్లు పప్పులు, పాలకూర, సంపూర్ణ ధాన్యాల్లో ఉండే మొక్కల ఆధారిత ఇనుము శరీరంలో శోషించేందుకు సహాయపడతాయి. అందువల్ల కొన్ని సందర్భాల్లో ప్రధాన భోజనంతో పండ్లు తీసుకోవడం పోషకాల శోషణకు ఉపయోగకరంగా ఉంటుంది. పండ్లు తినడానికి ఒకే ఒక్క ఉత్తమ సమయం అంటూ కచ్చితమైన నియమం లేదు. పండ్లను ఎప్పుడు తింటున్నామన్న దానికంటే రోజువారీ ఆహారంలో వాటిని తగిన పరిమాణంలో చేర్చుకోవడం ముఖ్యం. భోజనం తర్వాత పండ్లు తిన్నప్పుడు బరువుగా లేదా పొట్ట ఉబ్బరంగా అనిపిస్తే, వాటిని భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో లేదా సాయంత్రం 4 గంటల సమయంలో చిరుతిండిగా తీసుకోవడం కూడా ఒక ఎంపిక.



### ఏ సమయంలో తినాలి..

పండ్లను ఎక్కువ పరిమాణంలో ఒకేసారి తినకుండా తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. ఉదాహరణకు చిన్న యాల్ లేదా కొద్దిగా బెర్రీలు సరిపోతాయి. ముఖ్యంగా అధిక కేలరీల భోజనం చేసిన వెంటనే పెద్ద గిన్నె నిండా పండ్లు తినడం అవసరం లేదు. పండ్ల రసాల కంటే సంపూర్ణ పండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. పండ్లను రసంగా మార్చినప్పుడు పీచు పదార్థంలో కొంత భాగం తొలగిపోతుంది. దీంతో సహజ చక్కెరలు శరీరంలోకి వేగంగా చేరే అవకాశం ఉంటుంది. సంపూర్ణ పండ్లలోని పీచు జీర్ణక్రియను నియంత్రించడంలో, రక్తంలో చక్కెర వేగంగా పెరగకుండా చూడడంలో సహాయపడుతుంది. గ్యాస్ట్రో-ఈసోఫేజియల్ రిఫ్లక్స్ (+జు=ణ) సమస్య ఉన్నవారు కూడా పండ్ల ఎంపిక, సమయంపై కొంత జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు తీసుకోవడం వల్ల కొందరిలో యాసిడ్ రిఫ్లక్స్ లక్షణాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న చాలా మందికి భోజనం చేసిన వెంటనే పండ్లు తినడం హానికరం కాదు. పండ్లు కడుపులో కుళ్లిపోవడం లేదా పులిసిపోవడం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుందనే వాదనకు ఆధారం లేదు. అయితే సున్నితమైన జీర్ణవ్యవస్థ, తరచూ పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు ఉన్నవారు భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో పండ్లు తీసుకోవడం ద్వారా అసౌకర్యాన్ని తగ్గించుకోవచ్చు. చివరికి పండ్లను ఏ సమయంలో తింటున్నామన్న దానికంటే, వాటిని సరైన పరిమాణంలో, సంపూర్ణ రూపంలో తీసుకోవడం, మన శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం మరింత ముఖ్యమైన విషయమని నిపుణులు చెబుతున్నారు.

# శ్రీచరణి స్పిన్ మ్యాజిక్.. 8వ సారి ఆసియా కప్ గెలిచిన టీమిండియా

- మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం
- ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధనల మెరుపు అర్ధశతకాలు
- బంతితో అద్భుతం చేసిన యువ బౌలర్ శ్రీ చరణి.. 4 వికెట్లతో రాణించిన వైనం
- 72 పరుగుల భారీ తేడాతో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్న టీమిండియా
- భారత్ నిర్దేశించిన 184 పరుగుల లక్ష్య ఛేదనలో 111 పరుగులకే కుప్పకూలిన లంక



మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో భారత జట్టు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన తుది పోరులో శ్రీలంకను 72 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి రికార్డు స్థాయిలో 8వ సారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (68), స్మృతి మంధన (59) బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టిస్తే, యువ బౌలర్ శ్రీ చరణి (4/20) బంతితో మాయ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. భారత అమ్మాయిల జోరు ముందు లంక జట్టు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 184 పరుగుల లక్ష్యఛేదనలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. లంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 12.5 ఓవర్లలోనే 129 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. షఫాలీ 39 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 68 పరుగులు చేయగా, స్మృతి 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు సాధించింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు వేగంగా ఆడటంలో కాస్త తడబడినప్పటికీ, చివర్లో కమలిని కేవలం 5 బంతుల్లోనే ఓ ఫోర్, సిక్సర్‌తో 15 పరుగులు చేసింది. దీంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

అనంతరం 184 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు లంక బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కెప్టెన్ చమరి అటపట్టు (36) కాసేపు పోరాడినా, ఆమె ఔటయ్యాక లంక పతనం వేగవంతమైంది. ముఖ్యంగా, యువ స్పిన్నర్ ద

శ్రీ చరణి తన అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. కీలకమైన హర్షిత, నీలాక్షిక, కవిష, సుగందికల వికెట్లను పడగొట్టి లంకను కోలుకోలేని దెబ్బ తీసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టిన శ్రీ చరణికి, 3 వికెట్లు తీసిన దీప్తి శర్మ చక్కటి సహకారం అందించింది. దీంతో శ్రీలంక జట్టు సరిగ్గా 20 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు ఆసియా కప్‌ను గర్వంగా ముద్దాడింది.

టీమిండియా మహిళల జట్టు ఇప్పటివరకు మొత్తం 8 సార్లు ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. అందులో వన్డే ఫార్మాట్ లో 4 సార్లు, టీ20 ఫార్మాట్ లో 4 సార్లు టైటిల్ గెలిచింది.

వన్డే ఫార్మాట్: 2004, 2005-06, 2006, 2008

టీ20 ఫార్మాట్: 2012, 2016, 2022, 2026

ఓవరాల్ గా 10 సార్లు ఫైనల్‌కు చేరిన భారత జట్టు 8 సార్లు ఛాంపియన్‌గా నిలవగా, మరో రెండు సార్లు రన్నరప్‌గా నిలిచింది.

# అభిషేక్ విధ్వంసంతో ఆఫ్ఘన్ బేజారు.. తొలి టీ20 టీమిండియాదే!



ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపులో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిన తీరు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కేవలం 32 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 82 పరుగులు చేసి, ఆఫ్ఘన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని మరో 38 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించింది.టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, ఆఫ్ఘనిస్థాన్‌ను ఓ మోస్తరు స్కోరుకే పరిమితం చేసింది. అనంతరం 157 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (10) తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. అయితే, మరో ఎండ్ లో అభిషేక్ శర్మ, ఆఫ్ఘన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మొదటి నుంచి దూకుడు మంత్రాన్ని జపించి, బౌలర్ ఎవరనేది చూడకుండా బౌండరీల వర్షం కురిపించాడు.

ముఖ్యంగా భారత ఇన్నింగ్స్‌లో పవర్‌ప్లేలో అభిషేక్ ఆడిన తీరు మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. అతని ధాటికి పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ ప్రధాన బౌలర్లైన ఫజల్‌హక్ ఫరూఖీ, రషీద్ ఖాన్‌లను కూడా లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. అతని బ్యాటింగ్ చూసి ఆఫ్ఘన్ కెప్టెన్ నిస్సహాయంగా చూడటం తప్ప ఏమీ చేయలేకపోయాడు. 256.25 స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించి, టీ20 క్రికెట్‌లో అసలైన విధ్వంసం ఎలా ఉంటుందో చూపించాడు.మరో ఎండ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ (33 బంతుల్లో 42) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 53 బంతుల్లోనే 121 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యంలో అభిషేక్ పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఇషాన్ నిలకడగా ఆడుతూ అతనికి స్ట్రైక్ రొటేట్ చేశాడు. శతకం దిశగా సాగుతున్నట్టు కనిపించిన అభిషేక్, మహమ్మద్ నబీ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి రషీద్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8లి), తిలక్ వర్మ (3లి) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు.

అంతకుముందు టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఆఫ్ఘన్ తీవ్ర కష్టాల్లో పడింది. స్పిన్నర్లు అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి పొదుపుగా బౌలింగ్ చేసి ఒత్తిడి పెంచడంతో అఫ్గాన్ టాప్ ఆర్డర్ చేతులెత్తేసింది. ఒక దశలో 43 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కుప్పకూలిన ఆ జట్టు, ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (64 నాటౌట్) వీరోచిత అర్ధశతకంతో పుంజుకుంది. ఫలితంగా, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 19 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు.ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇక, ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ సెప్టెంబరు 15న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలోనే జరగనుంది.

# వైభవ్ సూర్యవంశీకి బిగ్ షాక్.. ఆఫ్ఘన్‌తో తొలి టీ20లో చోటు ఎందుకు దక్కలేదంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న తొలి టీ20 పోరులో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకున్నాడు. అరుణ్ జైట్లీ వికెట్‌పై ఛేజింగ్ అనుకూలిస్తుందనే అంచనాతో ఫీల్డింగ్ తీసుకున్నట్లు ప్రకటించిన అయ్యర్, ప్రెస్ వేదికగా ఒక షాకింగ్ న్యూస్ చెప్పి ఫ్యాన్స్‌ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న 15 ఏళ్ల యంగ్ పవర్‌హౌస్ వైభవ్ సూర్యవంశీని తొలి టీ20కి తుది జట్టు నుంచి తప్పించినట్లు ప్రకటించాడు.

**కారణం చెప్పని కెప్టెన్.. మేనేజ్‌మెంట్ రాజకీయం:**

వైభవ్ సూర్యవంశీని డ్రాప్ చేయడానికి గల కచ్చితమైన కారణాన్ని వెల్లడించడానికి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తోసిపుచ్చాడు. వైభవ్‌ను బెంచ్‌కే పరిమితం చేసి, అభిషేక్ శర్మకు జోడీగా సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించుతున్నట్లు మాత్రమే తేల్చి చెప్పాడు. ప్రాక్టీస్‌లో ఇబ్బంది పడ్డాడనే కారణంతో ఈ కుర్రాడిని పక్కనపెట్టడం వెనుక డ్రెసింగ్ రూమ్ రాజకీయం ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జస్ప్రీత్ బుమ్రా రీ ఎంట్రీ జట్టుకు కలిసొచ్చే అంశం అని శ్రేయస్ కొనియాడాడు.

**7 నెలల తర్వాత మైదానంలోకి ఆఫ్ఘన్:**

2026 టీ20 వరల్డ్ కప్‌లో ఫిబ్రవరి 19వ తేదీన కెనడాతో మ్యాచ్ తర్వాత ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆడుతున్న తొలి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఇదే కావడం విశేషం. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత పొట్టి ఫార్మాట్ ఆడుతున్న ఆఫ్ఘన్‌ను తక్కువ అంచనా వేయకుండా బోణీ కొట్టాలని భారత్ భావిస్తోంది. సెప్టెంబర్ 15, 17 తేదీల్లో జరగబోయే తదుపరి రెండు మ్యాచ్‌లకు కూడా ఢిల్లీనే వేదిక కానుంది.

# స్పిరిట్: వంగా బ్రదర్ ఆ రేంజ్ లో సవాల్ చేశారంటే..



సినిమా రిలీజ్ కు ముందు హైప్ రావడం కామన్.. కానీ ఓ మూవీ రివ్యూలను ఎదుర్కొంటుందనే విషయంలోనే ఫుల్ కాన్ఫిడెన్స్ చూపించడం మాత్రం హాట్ టాపిక్ గా మారింది. ఇప్పుడు రెబల్ స్టార్ ప్రభాస్ స్పిరిట్ విషయంలో ఇదే జరుగుతోంది. సినిమా ఎలా ఉంటుందో చెప్పడానికి ఇంకా టైమ్ ఉన్నా.. ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా చేసిన ఒక్క కామెంట్ మాత్రం స్పిరిట్ పై డిబేట్ స్టార్ట్ చేసింది.

తాను నిర్మించిన రోమాంచకం సినిమాపై వచ్చిన విమర్శల గురించి రీసెంట్ గా మాట్లాడిన ప్రణయ్ రెడ్డి.. సినిమా వెనుక ఉండే కష్టాన్ని రివ్యూలు రాసేవాళ్లు కూడా అర్థం చేసుకోవాలని అన్నారు. ఒక స్టోరీని దర్శకుడు స్క్రీన్ పైకి తీసుకురావడానికి చాలా కష్టపడతారని చెప్పారు. కానీ కొందరు రివ్యూల్లో చిన్న చిన్న విషయాలను కూడా పట్టుకుని సినిమాను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాదు.. అసలు



సవాల్ ను స్పిరిట్ మూవీ దగ్గరికి తీసుకొచ్చారు. నిజంగా అంత స్టామినా ఉంటే.. స్పిరిట్ ను రివ్యూలతో తగ్గించి చూపించగలరా అంటూ విమర్శకులకు సవాల్ విసిరారు. సినిమా విడుదలైన తర్వాత చూద్దామనే రేంజ్ లో ఆయన మాట్లాడటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కానీ ఇక్కడే అసలు పాయింట్ ఉంది. సాధారణంగా నిర్మాతలు తమ సినిమాపై విమర్శలు వస్తే వాటిని ఖండించే వరకు మాత్రమే వెళ్తారు.

కానీ స్పిరిట్ విషయంలో మాత్రం ప్రణయ్ రెడ్డి చేసిన కామెంట్స్ చాలా స్ట్రాంగ్ గా ఉన్నాయి. రివ్యూలు, విమర్శలు వచ్చినా సినిమాను నిలబెట్టేంత కంటెంట్ తమ దగ్గర ఉందనే నమ్మకం ఆయన మాటల్లో కనిపిస్తోంది. అందుకే ఆ కామెంట్ స్పిరిట్ పై అంచనాలను మరో రేంజ్ కు తీసుకెళ్తోంది. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్, సందీప్ రెడ్డి వంగా లాంటి దర్శకుడు కాంబోలో వస్తున్న సినిమా కావడంతో మొదటి నుంచే దీనిపై భారీ హైప్ ఉంది.

ఇప్పుడు నిర్మాత చేసిన సవాల్ దాన్ని ఇంకాస్త పెంచింది. ముఖ్యంగా సందీప్ సినిమాలపై ప్రేక్షకుల్లో అంచనాలు వేరు. ఆయన స్టోరీ, రోల్స్, యాక్షన్ మాత్రమే కాదు తనదైన టేకింగ్ తో మెప్పిస్తారు. అలాంటి దర్శకుడి నుంచి ప్రభాస్ తో వస్తున్న సినిమా కావడంతో స్పిరిట్ ఎలా ఉండబోతోందనే ఇంట్రెస్ట్ ఇప్పటికే ఉంది. ఇప్పుడు దానికి తోడు నిర్మాతే చేతనైతే సినిమా రివ్యూలతో తగ్గించి చూపండనే రేంజ్ లో సవాల్ విసరడంతో.. అసలు సినిమాలో ఏముందనే ప్రశ్న మరింత పెరిగింది.ఇక నిజంగానే స్పిరిట్ టీమ్ తమ కంటెంట్ పై అంత గట్టి నమ్మకంతో ఉందా? అన్నది సినిమా విడుదలైన తర్వాతే తెలుస్తుంది. అయితే ఒక్కటి మాత్రం క్లియర్ అని చెప్పాలి. స్పిరిట్ ఇంకా థియేటర్లలోకి రాకముందే.. దాని చుట్టూ డిబేట్ రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పుడు సినిమా విడుదలకు ముందే నిర్మాత నుంచి సవాల్ రావడంతో.. ఇక స్పిరిట్ పై వచ్చే ఫస్ట్ రివ్యూలు, ఆడియన్స్ రెస్పాన్స్ ఎలా ఉంటాయన్నది వేచి చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965